www.visalaandhra.com
బుధవారం
02-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 102
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మెక్సికో అధ్యక్షురాలిగా క్లాడియా ప్రమాణం

మెక్సికో సిటీ: మెక్సికోకు తొలి మహిళా అధ్యక్షురాలిగా క్లాడియా షీయిన్‌బౌమ్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకొన్న నాలుగు నెలల తర్వాత ఆమె మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా, అమెరికా అధ్యక్షుడి సతీమణి జిల్ బైడెన్‌తో సహా అనేక మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు.

పర్యావరణ కార్యకర్త వాంగ్‌చుక్ నిర్బంధం

మోదీ ప్రభుత్వ చర్యను ఖండించిన ప్రతిపక్షం

న్యూఢిల్లీ: పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, లడఖ్‌కు చెందిన దాదాపు 120 మందితో పాటు లడఖ్‌కు ఆరవ షెడ్యూల్ హోదాను డిమాండ్ చేస్తూ రాజధానికి ప్రదర్శన చేస్తుండగా సోమవారం రాత్రి దిల్లీ సరిహద్దులో అదుపులోకి తీసుకున్నారు. వారిని నిర్బంధించినప్పటికీ, వాంగ్‌చుక్, మరికొందరు వారిని ఉంచిన

- మిగతా 2 లో

'ముడా' భూములు వెనక్కి

బెంగళూరు: భూ కుంభకోణంపై కర్నాటకలో పెద్ద చర్చ సాగుతున్న సమయంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య నుంచి భూములు వెనక్కి తీసుకునేందుకు అంగీకారం తెలిపింది. ఆ భూముల్ని వెనక్కి ఇచ్చేస్తామని సిద్ధరామయ్య భార్య పార్వతి ఇప్పటికే ప్రకటించారు. తన భర్త రాజకీయ జీవితానికి అవినీతి మరక అంటరాదని 'ముడా'కు చెందిన 14 ప్లాట్లు తిరిగి ఇచ్చేస్తానని

- మిగతా 2 లో

కట్టడాలు ఏవైనా తొలగించాల్సిందే

న్యూఢిల్లీ: రోడ్లు, జలాశయాలు, రైలు ట్రాక్‌లను ఆక్రమించిన ఏ మత సంబంధ కట్టడాలనైనా తొలగించాల్సిందేనని... ప్రజల సురక్షితంగా ఉండటమే అత్యున్నత అంశమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. భారత్ సెక్యులర్ దేశమని... ఆక్రమణల

- మిగతా 2 లో

కేంద్రం వరద సాయం

ఏపీకి రూ. 1000 కోట్లు

తెలంగాణకు రూ.416 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన రాష్ట్రాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సాయమందించింది. ఏపీకి రూ.1,036 కోట్ల వరద సాయం ప్రకటించింది. అలాగే తెలంగాణకు రూ.416.80 కోట్లు విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాలకు వరద సాయం కింద రూ.5,858 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఇందులో ఏపీకి రూ.1,036 కోట్లను ఎన్డీఆర్ఎఫ్ కింద సాయం అందించనుంది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లు, అతి తక్కువగా నాగాలాండ్‌కు రూ.19.20 కోట్ల సాయం ప్రకటించింది. భారీ వర్షాలు, వరదలతో ఏపీకి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా విజయవాడ నగరంలోని బుడమేరు పరివాహక ప్రాంత ప్రజలు 12 రోజులపాటు ముంపు బారిన పడ్డారు. ఇల్లు, ఇంటిలోని సామాగ్రి, వాహనాలు, ఆటోలు దెబ్బతిని పూర్తిగా నిరాశ్రయులయ్యారు. వాటితోపాటు ఏడు జిల్లాల్లోనూ భారీ వర్షాలు, వరదల ప్రభావం చూపింది. పంట పొలాలు, చేపల చెరువులు దెబ్బతిన్నాయి. దీంతో రాష్ట్రానికి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర అధికారుల బృందం విచ్చేసి విజయవాడ నగరం పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. సీఎం చంద్రబాబుతో కలిసి వరద నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదలతో

- మిగతా 2 లో

'మద్యం' దరఖాస్తులు

- 9వరకు స్వీకరణ
- రెండేళ్ల కాలపరిమితితో దుకాణాల కేటాయింపు
- నూతన విధానం అమలుకు శ్రీకారం
- భారీగా పెరిగిన లైసెన్స్ ఫీజులు
- 11న లాటరీ ద్వారా ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: నూతన మద్యం పాలసీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం పాలసీకి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో తీసుకుంటారు. 11వ తేదీన ఆయా జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తారు. 12 నుంచి మద్యం దుకాణాలు ప్రారంభించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది 12 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు మద్యం దుకాణాల లైసెన్స్‌లు అమలులో ఉంటాయి. లాటరీలో లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు ఒక రోజు వ్యవధిలో మొదటి విడత లైసెన్స్ ఫీజు చెల్లించాలన్న నిబంధన విధించారు. సెప్టెంబరు 30వ తేదీతో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్) ప్రభుత్వ దుకాణాల పాలసీ గడువు ముగిసింది. నూతన మద్యం పాలసీ వచ్చేంత వరకు గత ప్రభుత్వ విధానమే కొనసాగనుంది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 3,396 ప్రైవేట్ దుకాణాలను కేటాయిస్తున్నారు. ఈ పాలసీ పూర్తయ్యాక, గీత కార్మికులకు రిజర్వ్ చేసిన మరో 340 షాపులకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇస్తారు. ఈ దుకాణాలకు అదనంగా ప్రీమియం బ్రాండ్లు విక్రయించేందుకు 12 ఎలైట్ షాపులకూ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ అవుతాయి. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలో ఏర్పాటు చేశారు. ఎలైట్ స్టోర్లకు ఐదేళ్ల కాల పరిమితి ఉంటుంది. మద్యం దుకాణాల దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) నిర్ణయించారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ

- మిగతా 2 లో

స్టీల్ ప్లాంట్‌లో మళ్లీ ఉద్రిక్తత

ఈడీ వర్క్స్ బిల్డింగ్ ముట్టడి

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు నిరసనగా ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించబోమని చెబుతోన్న కేంద్రం ప్రైవేటీకరణ దిశగా చర్యలు చేపడుతోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద నిత్యం ఉద్రిక్తత చోటు చేసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసే చర్యల్లో భాగంగా 4,290 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగింపు ప్రక్రియపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం స్టీల్

- మిగతా 2 లో

గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాయలసీమ

- సోలార్, విండ్ పవర్ ద్వారా 7.50 లక్షల మందికి ఉద్యోగాలు
- కర్నూలులో హైకోర్టు బెంచ్
- దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు
- సీఎం చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర బ్యూరో– కర్నూలు: రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని, సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి ద్వారా 7.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమాడలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో సీఎం మాట్లాడుతూ... పేదరికం లేని సమాజమే తమ అభిమతమని పేర్కొన్నారు. ఇంట్లో కూర్చుని పని చేసే విధానానికి శ్రీకారం చుడతామని చెప్పారు. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ పంపిణీని ప్రారంభిస్తామని, ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తామన్నారు. మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. రూ.100 కోట్లతో మద్యం మాన్పించే కార్యక్రమం చేపడతామన్నారు. ఓర్వకల్లులో పరిశ్రమలు నిర్మిస్తామని పేర్కొన్నారు. కర్నూలు - బళ్లారి రహదారిని జాతీయ రహదారి చేస్తామని హామీ ఇచ్చారు. వలంటీర్లను తీసుకునే ఆలోచన చేస్తామని తెలిపారు. డిసెంబరులో డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు ఇస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.నాలుగు వేలు పింఛన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. ఇప్పటి వరకు రూ.12,508 కోట్ల మేర పింఛన్లు అందజేశామన్నారు. రాష్ట్ర ఖజానాలో పది లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని, లక్ష కోట్లు వడ్డీ కట్టాలని తెలిపారు. సంపద సృష్టించి రాష్ట్రానికి పూర్వ వైభవం తెస్తామన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.1,674 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించామని వివరించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ చట్టం చేశామని, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా నుంచి నీళ్లు తరలించి బిందు సేద్యం పొలాలకు సాగునీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలవరం పూర్తి చేసి పెన్నాకు అనుసంధానం చేయగలిగితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోతే నిపుణులను పంపించి గేటు పెట్టించిన పార్టీ టీడీపీ అని అన్నారు. గుండ్రేవుల, ఆర్‌డీఎస్, గురు రాఘవేంద్ర పూర్తి చేసేందుకు ముందుకు వెళ్తామని చెప్పారు. ఐవీఆర్ఎస్ ద్వారా కలెక్టర్లు, ఎమ్మెల్యేల పనితీరు తెలుసుకుని నీతి వంతమైన, సమర్థవంతమైన పాలన అందిస్తామన్నారు. పుచ్చకాయలమాడ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఇళ్లు లేని 103 మందికి గృహాలు నిర్మించి ఇస్తామన్నారు. రేషన్ కార్డులు లేని వారికి

- మిగతా 2 లో

ఆక్రమణదారులూ ఖబడ్దార్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరిక
- భూమి... భుక్తి కోసం ఎర్రజెండాల పోరాటమే పరిష్కారం
- పాలకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర–కడప బ్యూరో : పేద ప్రజల భూములు ఆక్రమించుకున్న నాయకులకు నిద్ర పట్టకుండా చేస్తామని, ఖబడ్దార్ అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలవుతున్నా భూమి కోసం, భుక్తి కోసం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు నిరంతర పోరాటాలు చేస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదని, ఈ సమస్యల పరిష్కారానికి ఎర్రజెండాలే నాంది పలుకుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన సూచించారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ అధ్యక్షతన బద్వేలులో ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరసిస్తూ, భూ బాధితులకు అండగా నిలుస్తూ భారత కమ్యునిస్టు పార్టీ (సీపీఐ) పెద్ద ఎత్తున ర్యాలీతో పాటు బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. రామకృష్ణతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్య పాల్గొన్నారు. ముందుగా సిద్దవటం రోడ్డు నుంచి బద్వేలు నాలుగురోడ్ల కూడలి వరకు పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాధితులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడా పేదలకు సెంటు స్థలం మిగలకుండా భూ కబ్జాలకు యదేచ్ఛగా పాల్పడ్డారని, అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం వాటికి విముక్తి కలిగిస్తుందని ప్రజలు ఆశించినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భూ బాధితులతో సీపీఐ భారీ సమావేశం ఏర్పాటు చేసి ఆ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మదనపల్లెలో వేల ఎకరాలను కబ్జా చేశారని తెలిపారు. బడి, గుడి, స్మశానం అనే తారతమ్యం లేకుండా యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారని, ఆ విషయాలు బయటపడతాయని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్నే తగులబెట్టడం దురహంకారమన్నారు. భూముల ఆన్ లైన్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

త్వరలో 6 వేల కానిస్టేబుల్ నియామకాలు: అనిత

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: రాష్ట్రంలో అర్ధాంతరంగా ఆగిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. 6,100 పోస్టుల భర్తీకి సంబంధించిన శారీరక సామర్థ్య (పీఎంటీ,పీఈటీ) పరీక్షలను ఐదు నెలల్లోగా పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. 2022లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 4,59,182 మంది హాజరుకాగా... 95,209 మంది తదుపరి దశకు ఎంపికయ్యారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు కారణాల వల్ల వాయిదా పడడంతో కానిస్టేబుల్ (సివిల్)- 3,580, కానిస్టేబుల్ (ఏపీఎస్‌పీ) -2,520 పోస్టుల ప్రక్రియ వాయిదా పడిందన్నారు. ప్రిలిమినరీ పరీక్షకు 3,622 మంది హోంగార్డులు

- మిగతా 2 లో

ఇసుక బొక్కేస్తున్నారు!

- మామూళ్ల మత్తులో అధికారులు
- టన్నుల కొద్దీ తరలించుకుపోతున్న అక్రమార్కులు
- వాల్టా చట్టానికి తూట్లు... దర్జాగా సరిహద్దులు దాటుతున్న వైనం
- పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆదివాసీల నిలదీత

విశాలాంధ్ర –అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలోని డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. కొందరు రాజకీయ నేతల అండదండలతో అక్రమార్కులు దర్జాగా ఇసుకను అక్రమ రవాణా చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. వాస్తవానికి అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ప్రభుత్వపరంగా ఎటువంటి ఇసుక రీచ్‌లు లేవు. అయితే

- మిగతా 2 లో

లెబనాన్‌లో ఇజ్రాయిల్ భూతల దాడులు

బీరుట్: లెబనాన్‌లో భూతల దాడులను ఇజ్రాయిల్ ప్రారంభించింది. ఇప్పటివరకు వైమానిక దాడులు జరుపుతూ వచ్చిన యూద దేశం ఇప్పుడు ఆపరేషన్ నార్తెన్ ఆరోస్‌కు నడుం బిగించింది. దక్షిణ లెబనాన్ గ్రామాల్లోకి చొరబడి భూతల దాడులను మొదలు పెట్టింది. దక్షిణ బీరుట్‌లోని మూడు జిల్లాల ప్రజలను అక్కడ నుంచి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయిల్ సైన్యం ఆదేశించింది. 'హెజ్బుల్లాకు చెందిన స్థావరాల పరిసరాల్లో మీరంతా ఉన్నారు. తక్షణమే భవనాలను ఖాళీ చేయండి' అంటూ ఇజ్రాయిల్ సైనిక అధికార ప్రతినిధి అవిచే అద్రారీ పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో శత్రుదేశ సైనికులను లక్ష్యంగా చేసుకున్నట్లు హెజ్బుల్లా ప్రకటించడంతో ఇజ్రాయిల్ మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయిల్ దక్షిణ బీరుట్‌లో ఆరుసార్లు దాడి చేసినట్లు లెబనాన్ భద్రతాధికారి తెలిపారు. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బుల్లా మౌలిక వసతులు లక్ష్యంగా సరిహద్దు గ్రామాలలో పరిమిత దాడులు చేపట్టినట్లు ఇజ్రాయిల్ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. గాజా, ఇతర ప్రాంతాల్లోనూ దాడులు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. తమ భూభాగంలోకి ప్రవేశించాలని ఇజ్రాయిల్ నిర్ణయించుకుంటే... దీటైన బదులు ఇచ్చేందుకు తాము సిద్ధమని హెజ్బుల్లా తేల్చిచెప్పింది. కాగా, గత 24 గంటల్లో లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 95 మంది చనిపోగా, 172 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ తెలిపింది. బాల్‌బెక్-హెర్మల్ జిల్లాలో 16 మంది హతం కాగా 48 మందికి గాయాలయ్యాయని పేర్కొంది. అలాగే నబాతే గవర్నరేట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోయారని, 55 మంది గాయపడ్డారని వెల్లడించింది. బీరుట్‌లో నలుగురు చనిపోగా, మరో నలుగురికి గాయాలైనట్లు నివేదించింది. అటు సిరియా రాజధాని దమాస్కస్‌లోనూ ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైంది. తమ భూభాగంలో ఇజ్రాయిల్ మూడుసార్లు దాడి చేసిందని సిరియా అధికారిక వార్తాసంస్థ తెలిపింది. ఇజ్రాయిల్ దాడుల్లో యాంకర్ సఫా అహ్మద్ ప్రాణాలు కోల్పోయారని, మరో ముగ్గురు పౌరులు చనిపోయారని, ఇంకో తొమ్మిది మందికి గాయాలయ్యాయని తెలిపింది. ఇజ్రాయిల్ సైన్యం కొన్నేళ్లుగా సిరియాపై వందల దాడులు చేసింది. దక్షిణ బీరుట్‌పై ఇజ్రాయిల్ వైమానిక దళం బాంబుల వర్షంకురిపించింది. సిడాన్ నగరంలోని ఐన్ అల్ హెవెల్ క్యాంపు లక్ష్యంగా దాడి చేసింది. ఇదిలావుంటే, ఇజ్రాయిల్ ఏకపక్షంగా దాడులు చేస్తూ, పశ్చిమాసియా దేశాలను లక్ష్యంగా చేసుకుంటుండటాన్ని ప్రపంచ దేశాల నాయకులు తీవ్రంగా ఖండించారు. దురాక్రమణ, దమనకాండ ఆపాలంటూ ఇజ్రాయిల్‌కు సూచించారు. ఉద్రిక్తతలు పెంచవద్దని హితవు పలికారు. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్‌కు అధికార ప్రతినిధి స్టెఫనే

కాల్పులు విరమించాలి: ప్రపంచ నేతలు

దుజారిక్ స్పందిస్తూ ఏ విధంగానూ భూతల దాడులు జరగాలని కోరుకోవడం లేదని వెల్లడించారు. ఇజ్రాయిల్ వెనక్కు తగ్గడం అవసరమని, మిగతా వర్గాలు కూడా సంయమనం పాటించాలన్నారు. ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా నిలిచిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైతం తక్షణమే కాల్పులు విరమించాలంటూ పిలుపునివ్వడం గమనార్హం.

గాజా శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ దాడి: 12 మంది మృతి

గాజా: సెంట్రల్ గాజా స్ట్రిప్‌లోని నుసిరత్ శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడిలో 12 మంది చనిపోయారని, అనేక మందికి గాయాలయ్యాయని పలస్తీనా అధికారి తెలిపారు.

క్యాంపులోని రెండు నివాసాలు లక్ష్యంగా ఇజ్రాయిల్ యుద్ధవ విమానాలు దాడి చేసినట్లు గాజా పౌర రక్షణ శాఖ అధికార ప్రతినిధి మెహమూద్ బసల్ వెల్లడించారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. గతేడాది అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటివరకు సుమారు 42వేల మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది.

చైనాలో కమ్యూనిస్టు పాలనకు 75 ఏళ్లు

శాంతి, సుస్థిరతకు జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: చైనాలో కమ్యూనిస్టు పార్టీ పాలనకు 75ఏళ్లు అయ్యాయి. సోవియట్ యూనియన్ 74ఏళ్ల మైలురాయిని చైనా అధిగమించింది. ఈ సందర్భంగా టియాన్మెన్ స్క్వేర్‌లో పతాకావిష్కరణ, వేడక జరిగాయి. రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ పీపుల్స్ ఆఫ్ ది పీపుల్‌లో అధ్యక్షుడు జిన్‌పింగ్ విందు ఏర్పాటు చేశారు. అంతకుముందు సభలో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) పాలనలో సాధించిన విజయాలు, మానవాళి అభివృద్ధికి, శాంతి స్థాపనకు చేపట్టిన చర్యలను జిన్‌పింగ్ గుర్తుచేశారు. కొత్త శకంలో కొత్త ప్రమాణం మొదలవుతోందని ఉద్ఘాటించారు. చైనాను మరింత శక్తిమంతమైన దేశం నిర్మించుకోవడం అవసరమని అన్నారు. అన్ని రంగాల్లో రాణించడమే కాకుండా చైనా ఆధునికీకరణ దిశగా ముందుకెళ్లడం ముఖ్యమని చెప్పారు. ఈ దిశగా ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమించేందుకు సంసిద్ధంగా ఉండాలని సీపీసీ పాలకపక్షానికి జిన్‌పింగ్ సూచించారు. సోషలిజం మార్గానికి కట్టుబడాలన్నారు. పరస్పర సహకారం, నాయకత్వంలో పార్టీకి పెద్ద పీట ద్వారానే చైనా అధునికీకరణ లక్ష్యాలు సాధ్యమని చెప్పారు. హాంకాంగ్, మకావ్‌కు సంబంధించి ఒక దేశం, రెండు వ్యవస్థల విధానాన్ని అమలు చేయడానికి కట్టుబడాలని, ఇది ఎంతో ముఖ్యమని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. హాంగ్‌కాంగ్, మకావ్‌లో దీర్ఘకాల సుస్థిరత, సుసంపన్నతను ఆకాంక్షించారు. తైవాన్ తమ దేశంలో అంతర్గత భాగమంటూ పునరేకీకరణకు పిలుపునిచ్చారు. తైవాన్ స్ట్రెయిట్‌తో సమన్వయం, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతాన్ని ఆకాంక్షించారు. తైవాన్ వేర్పాటువాదాన్ని వ్యతిరేకించాలన్నారు. సమస్త మానవాళి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్, శాంతి స్థాపనలో చైనా మరింత కీలకంగా వ్యవహరించాలని జిన్‌పింగ్ అన్నారు. 75ఏళ్ల తర్వాత కూడా ఎన్నో సవాళ్లు తమ ఎదుట ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు సిద్ధంగా కావాలని కోరారు.

జపాన్ ప్రధానిగా షిగెరూ ఇషిబా

టోక్యో: జపాన్‌లో అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) నాయకుడు షిగెరు ఇషిబా మంగళవారం దేశ ప్రధానిగా ఎన్నికయ్యారు. పార్లమెంటు ఉభయ సభల్లో మెజారిటీ ఓట్లను ఆయన గెలుకున్నారు. ప్రతినిధుల సభలో మొత్తం 461కుగాను 291 ఓట్లు ఇషిబాకు పోలయ్యాయి. కౌన్సిలర్ల సభలో 242కుగాను 143 ఓట్లను ఆయన పొందారు. ప్రత్యేక డైట్ సెషన్‌లోభాగంగా ప్రధాని ఎన్నిక జరిగింది. అనంతరం కొత్త కేబినెట్ కొలువుదీరింది. ఇందులో 13 మంది కొత్త వారికి స్థానం దక్కింది. ఇషిబా కేబినెట్‌లో ఇద్దరు మహిళలు మాత్రమే ఉన్నారు. కాగా ఫుమియో కిషిదా మంగళవారం ఉదయం ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఆయన స్థానంలో ఇషిబా బాధ్యతలు చేపట్టబోతున్నారు. దేశానికి నాయకత్వం వహించే క్రమంలో ఆయన అనేక సవాళ్లను ఎదుర్కోనున్నారు. ఎల్‌డీపీపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం ఆయనకు పెద్ద సవాల్‌గా ఉంది. కాగా, అక్టోబరు 27న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ఇషిబా భావిస్తున్నారు.

'ముడా' భూములు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. 'మా అన్నయ్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈ ప్లాట్లు ఇంత రాద్ధాంతం చేస్తాయని ఊహించలేదు. నా భర్త గౌరవం, ప్రతిష్ఠ కంటే ఈ ఆస్తులు గొప్పవి కావు. ఇన్నేళ్లు ఆయన అధికారం నుంచి ఏమీ ఆశించని మాకు ఈ ఆస్తులు తృణప్రాయం. ఈ స్థలాలను తిరిగి ముడాకు అప్పగిస్తున్నా. దీనిపై నా భర్త అభిప్రాయం తెలియదు. కుటుంబసభ్యులతోనూ చర్చించలేదు. నేను సొంతంగా నిర్ణయించుకున్నా. ఆరోపణలు వచ్చినప్పుడే ఈ నిర్ణయం తీసుకోవాలనుకున్నా. రాజకీయ కుట్రలో నా భర్త నష్టపోతున్నారనే భూములు వెనక్కి ఇచ్చేయాలనుకున్నా. అవసరమైతే దర్యాప్తునకు సహకరిస్తా. రాజకీయాలకు దూరంగా ఉండే నాలాంటి మహిళలను వివాదాల్లోకి లాగొద్దు' అని ఆమె పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ముడా అధికారులు... వివాదాస్పదమైన భూములను వెనక్కి తీసుకునేందుకు అంగీకరించారు.

'ముడా' వ్యవహారంలో ఈడీ కేసా...?

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం ఈడీ తనపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కేసును నమోదు చేయడాన్ని ప్రశ్నించారు. ముడా వ్యవహారానికి దాని నిబంధనలు వర్తించవని తెలిపారు. 'ఇది ఏ కారణాలతో మనీలాండరింగ్ కేసు అని తెలియదు. బహుశా మీకు కూడా అలాగే అనిపిస్తుంది. నా ప్రకారం, పరిహారం స్థలాలు ఇచ్చినందున దీనికి మనీలాండరింగ్ కేసు వర్తించదు' సిద్ధరామయ్య అన్నారు.

గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాయలసీమ

(మొదటిపేజీ తరువాయి)

కార్డులు ఇస్తామన్నారు. 230 మందికి కుళాయిలు, 105 మందికి మరుగుదొడ్లు, ఒకరికి విద్యుత్ కనెక్షన్ వెంట నే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి కలెక్టర్ శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

తొలుత చంద్రబాబు విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుని హెలికాప్టర్ లో పుచ్చకాయలమాడకు చేరుకున్నారు. తలారి గంగమ్మ, వెంకటేష్ ఇళ్లకు వెళ్లి వారికి ఎన్టీఆర్ భరోసా ఫించన్‌లు అందజేశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, గుమ్మనూరు జయరాం, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కలెక్టర్ పీ రంజిత్ బాషా, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ జీ బిందు మాధవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సర్పంచ్ హారిక, ఎంపీటీసీ చంద్ర పాల్గొన్నారు.

కట్టడాలు ఏవైనా తొలగించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తొలగింపు, బుల్డోజర్‌తో చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని బెంచ్ పేర్కొంది. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఏదైనా నేరంలో ఉండటమే వ్యక్తి ఇంటిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవడానికి ఆధారమా అని ఆయన్ను బెంచ్ ప్రశ్నించింది. దీనికి మెహతా స్పందిస్తూ.. 'కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు జారీ చేసి ఇంటి గోడపై అంటించినా పరిగణలోకి తీసుకోం. ఇది ముందే జరిగి ఉంటేనే చర్యలు తీసుకొంటాం' అని పేర్కొన్నారు. ఒక వర్గానికి సంబంధించిన కొన్ని ఘటనల ఆధారంగా న్యాయస్థానం మార్గదర్శకాలు జారీచేసిందని తాను ఆందోళన చెందుతున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ... 'మనది సెక్యూలర్ దేశం. మా మార్గదర్శకాలు జాతిమతాలతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తాయి. ఇక ఆక్రమణల విషయానికి వస్తే మేము ఇప్పటికే చెప్పాం. ఏదైనా మత సంబంధమైన నిర్మాణం రోడ్డు, ఫుట్‌పాత్, జలాశయం, రైలు పట్టాపై ఉంటే అది ప్రజలకు అడ్డంకి కాదా. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒక్కటే చట్టం' అని వ్యాఖ్యానించింది. ఇక యూన్ రిపోర్టర్ సీనియర్ అడ్వొకేట్ వ్రిందా గ్రోవర్ ... ఇళ్ల లభ్యతపై వాదనలు వినిపించారు. దీనికి సొలిసిటర్ జనరల్ మెహతా అభ్యంతరం చెబుతూ 'ఈ విషయాన్ని అంతర్జాతీయకరించాల్సిన అవసరం లేదని... దేశ న్యాయస్థానాలకు తగినంత శక్తి ఉందన్నారు. అంతర్జాతీయ ఏజెన్సీ జోక్యం అవసరం లేదు' అని పేర్కొన్నారు. పిటిషనర్ల తరపున న్యాయవాది సీయూ సింగ్ వాదిస్తూ... బుల్డోజర్ చర్యలను నేరాలపై పోరాడేందుకు ఉపయోగించకూడదని అభ్యర్థించారు. కాగా, పంచాయతీలకు, పురపాలక కార్పొరేషన్లకు విభిన్నమైన చట్టాలున్నాయని న్యాయస్థానం పేర్కొంది. వీటికి ఆన్‌లైన్ పోర్టల్స్ ఉండాలని అభిప్రాయపడింది. వాటిల్లో డిజిటలైజ్ చేసిన రికార్డులు అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

పర్యావరణ కార్యకర్త వాంగ్‌చుక్ నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు స్టేషన్ల వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. కాగా, వాంగ్‌చుక్ నిర్బంధాన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఖండిస్తూ, ప్రభుత్వ చర్యను విమర్శించారు. 'ఢిల్లీ చలో' పేరుతో చేపట్టిన ఈ పాదయాత్ర సెప్టెంబరు 1న లేహ్ నుంచి ప్రారంభమైంది. దీనికి వాంగ్‌చుక్ నాయకత్వం వహించారు. లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ (కేడీఏ) మద్దతు ఇచ్చాయి. ఈ సమూహాలు లఢాఖ్‌కు రాష్ట్ర హోదా, భారత రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం, ఈ ప్రాంతానికి ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ కోసం, లేహ్, కార్గిల్‌లకు ప్రత్యేక లోక్‌సభ స్థానాల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. అయితే సెప్టెంబరు 30న వాంగ్‌చుక్ తన కార్యకర్తలతో దేశ రాజధానికి చేరుకోగా, వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు, ప్రతిపక్ష నాయకులు దీనిని 'ప్రజాస్వామిక' చర్య అని పేర్కొన్నారు. నిర్బంధించబడటానికి కొద్దిసేపటి ముందు, వాంగ్‌చుక్ ఢిల్లీ సరిహద్దు నుండి ఇన్‌స్టాగ్రామ్‌లో తన పాదయాత్ర ఫొటోలను పంచుకున్నారు. ఇదిలాఉండగా, అక్కడ పోలీసులు వారి బస్సులను ఆపారు. 'మేము ఢిల్లీకి చేరుకుంటున్నప్పుడు మా వెంట భద్రతగా ఉన్నట్లు లేదు. మమ్మల్ని అదుపులోకి తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది' అని వాంగ్‌చుక్ అన్నారు. శాంతిభద్రతలపై ఆందోళనలను ఉటంకిస్తూ, ఢిల్లీ పోలీసులు సెప్టెంబరు 30న సెంట్రల్ ఢిల్లీ, పరిసర ప్రాంతాలలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడడాన్ని నిషేధించారు.

మోదీ ప్రభుత్వ చర్యను ప్రతిపక్ష నేతలు విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, 'పర్యావరణ, రాజ్యాంగ హక్కుల కోసం శాంతియుతంగా కవాతు చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ జీ, వందలాది లడఖీలను నిర్బంధించడం ఆమోదయోగ్యం కాదు' అని 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో వృద్ధులను ఎందుకు నిర్బంధిస్తున్నారని ప్రశ్నించారు. 'మోదీ జీ, రైతుల మాదిరిగానే ఈ 'చక్రవ్యూహం' కూడా విరిగిపోతుంది. అలాగే మీ అహంకారం కూడా విరిగిపోతుంది. మీరు లడఖ్ స్వరాన్ని వినవలసి ఉంటుంది' అని తెలిపారు. ఢిల్లీలో బీజేపీ ప్రాధాన్యతలను ఆప్ నేత మనీశ్ సిసోడియా ప్రశ్నించారు. 'అమిత్ షా, ప్రధాని మోదీ, బీజేపీ ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఢిల్లీలో గూండాలకు బీజేపీ పూర్తి రక్షణ కల్పించింది. అయితే దేశాన్ని ప్రేమించే సోనమ్ వాంగ్‌చుక్ లాంటి వాళ్లను ఉగ్రవాదులుగా పరిగణిస్తోందని సిసోడియా అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, మోదీ ప్రభుత్వానిది అహంకారం, అప్రజాస్వామిక ప్రవర్తన అని ఆరోపించారు. లడఖ్ నుంచి శాంతియుతంగా ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న పౌరుల సమూహాన్ని నిర్బంధించింది' అని అన్నారు.

త్వరలో 6 వేల కానిస్టేబుల్ నియామకాలు

(మొదటిపేజీ తరువాయి)

హాజరుకాగా 382 మంది అర్హత సాధించారన్నారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించని 100 మంది హోంగార్డులు హైకోర్టులో 14 రిట్ పిటిషన్లు వేశారన్నారు. ప్రత్యేక కేటగిరీ కోటాలో ప్రత్యేక మెరిట్ జాబితాను ప్రకటించాలని వారు కోర్టును ఆశ్రయించారన్నారు. వీరిని తదుపరి దశకు అనుమతించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వివరించారు. దీనిపై న్యాయ సలహా తీసుకొని... ఆ సలహా మేరకు రెండవ దశ (పీఎంటీ, పీఈటీ)ను వెంటనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలను స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని మంత్రి అనిత పేర్కొన్నారు. రెండోదశలో ఉత్తీర్ణులైన వారికి మూడవ దశ ప్రధాన పరీక్ష (ఫైనల్ రాత పరీక్ష) జరుగుతుందని ఆమె తెలిపారు.

'మద్యం' దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)

నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఈ మొత్తం ప్రక్రియ విధి విధానాలను ఏపీ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా పర్యవేక్షిస్తున్నారు.

5 లక్షల జనాభా దాటితే...
85 లక్షల లైసెన్స్ ఫీజు

ఈ విడత మద్యం లైసెన్స్ ఫీజులను భారీగా పెంచారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం పట్టణాల్లో 12 ప్రీమియం దుకాణాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. జనాభా ప్రాతిపదికన మద్యం దుకాణాలను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 10 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ.50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో 55 లక్షలు, 50,001 నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న పట్టణాల్లో లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా నిర్ధారించారు. 5 లక్షలు దాటిన నగరాల్లో గరిష్ఠ ఫీజు రూ.85 లక్షలుగా నిర్ణయించారు.

లైసెన్స్ ఫీజులతో పాటుగా వారికి ఇచ్చే మార్జిన్‌ను ఈసారి రెట్టింపు చేశారు. రెండో ఏడాది రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌పై పది శాతం పెంపుదలకు ప్రతిపాదించారు. 12వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. దసరా పండుగకు ముందే నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. టెంపుల్ సిటీ తిరుపతిలో ప్రీమియం షాపులను కేటాయించలేదు. ఈ నూతన పాలసీ ద్వారా రూ.99కే క్వార్టర్ మద్యం అందుబాటులోకి రావడంతో మద్యం ప్రియులకు శుభవార్త కానుంది.

ప్రభుత్వ మద్యం దుకాణాలు మూత

నూతన మద్యం పాలసీ అమలులోకి రావడంతో ఇప్పటి వరకు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ అధ్వర్యంలో నడుపుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి. సెప్టెంబరు 30వ తేదీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల కాల పరిమితి పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాల్లోని సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలంటూ షాపులు మూసివేసి నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో మద్యం షాపులు మూతపడ్డాయి. అక్టోబరు 1 నాటికి తమ ఐదేళ్ల కాంట్రాక్టు ముగిసిందని వారు దుకాణాలను మూసివేసి నిరసనకు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కుటుంబాలను ఆదుకోవాలని తిరువూరులో ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వెల్ఫేర్ అధ్వర్యంలోని మద్యం షాపుల సూపర్ వైజర్లు, సేల్స్‌మేన్లు నిరసనకు దిగారు. మరో పది రోజులపాటు వైన్‌షాపులు తెరుస్తామని, ఆ సమయంలో ఉద్యోగులు పనిచేయాలని ప్రభుత్వం కోరగా, కొన్ని చోట్ల సిబ్బంది వెనక్కి తగ్గారు. మద్యం కావాలంటే మందు ప్రియులు బార్లకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. మద్యం దుకాణాల కంటే... బార్లలో మద్యం ధరలు అధికంగా ఉంటాయి. ఈనెల 12వ తేదీన ప్రైవేట్ దుకాణాలు తెరిచేంత వరకు మందుబాబులకు మద్యం ప్రియంగా మారనుంది.

నేడు మహిళా ఐక్యవేదిక ధర్నా

మద్యం దుకాణాలను ప్రైవేట్‌కు కేటాయించడాన్ని, నూతన మద్యం పాలసీ విధానాన్ని నిరసిస్తూ మహిళా సంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో బుధవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ధర్నా చేపట్టనుంది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు దీనికి హాజరవుతారు. ఈ ధర్నాలో వేదిక నేతలు పి.దుర్గాభవాని, డి.రమాదేవితో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటున్నారు.

ఏపీకి రూ.వెయ్యికోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాథమికంగా నష్టం అంచనాలు దాదాపు రూ.7,600 కోట్లు జరిగినట్లు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. దానిపై కేంద్రం నుంచి కేవలం రూ.1,036 కోట్లనే విడుదల చేసింది. తక్షణమే రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని అన్ని పార్టీలు డిమాండ్ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం పంపిన అంచనాలకు భిన్నంగా, అరకొరగా కేంద్రం సాయం ప్రకటించింది. ఈ సాయంతో వరద బాధితులను, పంట నష్టాలకు గురైన రైతులను పూర్తిగా ఆదుకోవడం కష్టతరంగా మారుతుంది. ఇప్పటికే బాధితులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని ఆందోళనబాట పడుతున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పంపిన అంచనాలకు అనుగుణంగా కేంద్రం నిధులను విడుదల చేయాల్సిన అవసరముంది.

ఇసుక బొక్కేస్తున్నారు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ అనుమతులతో అధికారికంగా నిర్మించే భవనాలకు మాత్రం ఇసుక సరఫరా చేసే విధానం అమలులో ఉంది. ప్రైవేటు ఇతరత్రా నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయాలంటే రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరి. అయితే ఆయా మండలాల్లో మాత్రం ఇసుక అక్రమార్కులు ఇవేమీ పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని ఇష్టారాజ్యంగా తరలించకపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవలసిన అధికారులు కమీషన్ల మత్తులో మునిగి తేలుతున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

డుంబ్రిగుడ మండలం గోరాపూర్, కురిడి గడ్డ, అనంతగిరి మండలం కాశీపట్నం, గరుగుబల్లి, జిలుగులపాడు, వెంకయ్యపాలెం పరిసర ప్రాంతాల నుంచి ప్రతిరోజు వందలాది లారీలలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇంత జరుగుతున్నా పాలకులు, అధికారులు ఎందుకు మౌనంగా ఉండి పోతున్నారని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని చెబుతుండగా... ఇక్కడ అధికారికంగా అనుమతులు లేకపోయినా అక్రమార్కులు లారీ, వ్యాన్ లోడులకు వేలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని మండిపడుతున్నారు. దర్జాగా అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వ పాలకులకు, అధికారులకు ఎందుకు పట్టడం లేదని గిరిజనులు నిలదీస్తున్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా గెడ్డలను గుట్టలుగా మారుస్తుండడం వల్ల భవిష్యత్తులో గోరపూర్ ఇతర ప్రాంతాలలో కూడా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గోరపూర్‌గడ్డ ప్రధాన మార్గంలో ఇసుక అక్రమ తవ్వకాలతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయని వీటి వలన అనేకమంది మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆదివాసీలు భయాందోళన చెందుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడం, అక్రమార్కులు ... పాలకులు, అధికారులను తప్పుదోవ పట్టించడం వల్లనే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి అక్రమార్కులపై కేసులు పెట్టాలని గిరిజన సంఘాల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయని పక్షంలో డుంబ్రిగూడ మన్యం మరో రాజస్థాన్ ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

స్టీల్ ప్లాంట్‌లో మళ్లీ ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ప్లాంట్‌లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కాంట్రాక్ట్ కార్మికులు ఈడీ వర్క్స్ భవనాన్ని చుట్టుముట్టారు. తమకు న్యాయం చేయాలని, తమ తొలగింపునకు పూనుకుంటున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్య వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు అక్కడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున చేరుకున్న కార్మికుల ఆగ్రహానికి ఈడీ కార్యాలయం అద్దాలు పగిలాయి. గత రెండు రోజుల క్రితం తొలగింపు చర్యలకు పూనుకున్న యాజమాన్యం అక్టోబరు 1 నుంచి పాస్‌లు నిలుపుదల చేయడంతో పెద్దఎత్తున ఈ ఆందోళనకు దిగారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమి స్కిల్డ్ పద్ధతిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలన్న యాజమాన్య వైఖరికి నిరసనగా చేపట్టిన ఈ ఆందోళనకు కార్మిక సంఘాల నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల నిరసనతో ఆ ప్రాంతం అట్టుడికిపోయింది. మరో పక్క ఉక్కు కార్మికుల ఉద్యమాన్ని ఉధృతం చేశారు. స్టీల్ ప్లాంట్ బీసీ గేటు వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని కార్మిక నేతలు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, 4,290 మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ప్రక్రియలో తాత్కాలికంగా వెనక్కు తగ్గినా, భవిష్యత్‌లో తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉక్కు కార్మికులను ఏం చేద్దామనుకుంటున్నారు : శాసనమండలి విపక్ష నేత బొత్స

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని శాసనమండలి విపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిర్ణయంపై బొత్స విశాఖలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగాలిస్తామని చెప్పిన ప్రభుత్వం ఒకేసారి 4,290 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారని, మరి మీ పాలనలో ఉద్యోగాలిస్తున్నారా స్టీల్ ప్లాంట్ కార్మికులతో మొదలుపెట్టి అందరినీ తొలగింపునకు పూనుకుంటున్నారా అని ప్రశ్నించారు.

ఆక్రమణదారులూ ఖబడ్దార్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన తరువాత గెస్ట్ హౌస్‌ల్లో కూర్చొని రెవెన్యూ డివిజనల్ స్థాయి అధికారులు పేదలకు తెలియకుండానే వారి భూములను పెత్తందారులకు దోచిపెట్టారని విమర్శించారు. బద్వేలు నియోజకవర్గంలో ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఉన్నాయని, టీడీపీ, వైసీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి కబ్జా చేస్తున్నా అడిగే నాయకుడు, ప్రశ్నించే అధికారి లేడని అన్నారు. ఈ కబ్జా కోరల్లో పేద, దళిత కుటుంబాలు ఎన్నో నలిగిపోయాయని, ఆ వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని, వీటిని పాలకులు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అంటూ అధికారంలోకి వచ్చారని, కానీ ప్రజల సమస్యలను పక్కనపెట్టి అనవసర విషయాలను తెర పైకి తెచ్చి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తన మేనిఫెస్టోలో ఇచ్చినమాట ప్రకారం పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవడం కోసం 3 సెట్లు, నగర ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలన్న మాటకు కట్టుబడి ఉండాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల పరిస్థితిపై రెవెన్యూ మంత్రి, గృహ నిర్మాణ మంత్రిని కలిసి వివరించామని, 8 లక్షల ఇళ్లను గుర్తించడానికి సిద్ధంగా ఉన్నామని, త్వరలో కార్యరూపం దాలుస్తుందని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. భూమి, భుక్తి కోసం పోరాటాలు చేసింది ఒక్క ఎర్రజెండాలేనని, తెలంగాణా ఉద్యమ సమయంలో 10 లక్షల ఎకరాలు పంపిణీ చేసిన ఘనత ఎర్రజెండాలదేనన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలోని ఆలూరులో పోరాటాలు చేసి పేదలకు ఇళ్లకు, వ్యవసాయానికి కావాల్సిన భూములను సమకూర్చింది ఎర్రజెండాలేనని ఆయన చెప్పారు. కడప జిల్లా బద్వేలులోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భూ పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని రామకృష్ణ స్పష్టం చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో ఎక్కువగా అటవీ, బంజరు, పోడు భూములు ఉన్నాయని, ఇక్కడ పేదలకు నివాసాలకు, వ్యవసాయానికి పంపిణీ చేసినట్లయితే వలసలు తగ్గి పేదలు సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. కానీ పేదలకు అందాల్సిన భూములను పెద్దలు గద్దల్లా తన్నుకుపోతున్నారని, వీటిని అరికట్టడానికి ఎర్రజెండాలు ఉద్యమరూపంలో ముందుకు కదులుతాయని హెచ్చరించారు. కలసపాడు, కాశినాయన, గోపవరం, బద్వేలు టౌన్, మండలాల్లో స్థలాలకు గిరాకీ పెరడంతో పార్టీల నాయకులు సిండికేట్‌గా ఏర్పడి యదేచ్ఛగా భూములను కబ్జా చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో ప్రధాని మోదీ నేను రాముడి బిడ్డనంటూ రాజకీయాలు చేస్తున్నాడని, రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం అంటూ పాలన గాలికి వదిలి వ్యవహరిస్తున్నారని, వీటిని చంద్రబాబు ప్రోత్సహించడం మరింత విడ్డూరంగా ఉందని అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ పెత్తందారీ విధానాలను విడిచినప్పుడే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు. బద్వేలు నియోజకవర్గంలో గోవిందరెడ్డి, విజయమ్మ, వైసీపీ నాయకులు ఐక్యంగా ఉంటూ కబ్జాలకు తెరలేపారన్నారు. సికొత్తపల్లెలో 300 ఎకరాలు కబ్జా ఎవరు చేశారన్న విషయం అందరికీ తెలిసినా నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నారని మండిపడ్డారు. ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డి వేల ఎకరాలు కబ్జా చేశాడని విమర్శించిన నాయకులే తమ పార్టీలోకి ఆహ్వానించి కండువాలు వేసి వారి నేరచరిత్రను కప్పిపుచ్చడానికి పునాదులు వేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ముందుకు వెళ్లాలన్నారు. లేనిపక్షంలో ఎర్రజెండాలకు ఉన్న కర్రలతోనే పోరాటానికి నాంది పలకాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సీపీఐ నిర్వహించిన భారీ ప్రదర్శన, సభలో పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, వెంకటశివ, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, ఎం.వి.సుబ్బారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు భాగ్యమ్మ, జమ్మలమడుగు ప్రసాద్, మైదుకూరు షావలి, భాస్కర్, శివరాం, బద్వేలు ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్దులపల్లి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు రమణ, రవికుమార్, ఇమ్మానుయేలు, పడిగ వెంకటరమణ, పెంచలయ్య, కేశవ, విజయమ్మ, సునీల్, ప్రసాద్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ నిరతి వెలకట్టలేనిది

యు.రాజుపాలెం సంస్మరణ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-కడప బ్యూరో: అమర వీరుల త్యాగ నిరతి వెలకట్టలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అని కొనియాడారు. మంగళ వారం కడప జిల్లా వీరపునాయునిపల్లి మండలం యు.రాజుపాలెం గ్రామంలో అమర వీరుల స్థూపాల వద్ద జరిగిన సంస్మరణ సభలో రామకృష్ణ ప్రసంగించారు. 1949 అక్టోబర్ 1న యు.రాజుపాలెం గ్రామంలో పోలీస్‌కాల్పుల్లో ముగ్గురు దళిత కమ్యూనిస్టు నాయకులు వీరమరణం చెందారు. నిషేధిత కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించడాన్ని కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలోనే కమ్యూనిస్టు నాయకుల పైన పోలీసులు విచక్షణా కాల్పులకు తెగబడ్డారు. ఆనాటి ఘటనలో దళిత కామ్రేడ్లు లంపల పెద్ద వెంకటన్న, లంపల చిన్న వెంకటన్న, చెప్పలి మారెన్న మృతి చెందగా పోలీసు కాల్పుల్లో వెంకటరామయ్య ,పాలేటి గంగులు గాయపడ్డారు. ఈ ఘటన జరిగి 75 ఏళ్లు గడిచింది. యు.రాజుపాలెం గ్రామంలో అక్టోబర్ 1న పోలీస్ కాల్పుల్లో అశువులు బాసిన అమర వీరుల సంస్మరణ దినాన్ని జరపడం ఆనవాయితీ. రామకృష్ణ మాట్లాడుతూ... చరిత్రను వక్రీకరించే విధంగా స్వాతంత్ర సంగ్రామం లో పాల్గొనని పార్టీలు సైతం నేడు డాంబికాలు పలకడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజల గోడు, ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోకుండా నేడు అధికారంలో ఉన్నవారు పాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, జి. ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ సభకు అధ్యక్షత వహించగా, సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య అతిధులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, సుబ్బారెడ్డి, వెంకటశివ, సుబ్బరాయుడు, కేసీబాదుల్లా, పార్టీ ఏరియా కార్యవర్గ సభ్యులు దస్తగిరి, చంద్రయుడు, శాఖ నాయకులు కులయప్ప, కేశవ, దస్తగిరి, వీరన్న, నాగయ్య, వెంకటన్న, రమణ, బాల వీరన్న, బాదుల్లా ,బాబు, నాగలింగం తదితరులు పాల్గొన్నారు.

సిట్ విచారణకు బ్రేక్!

లడ్డూ కల్తీపై సీబీఐ దర్యాప్తునకు సర్కారు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశవ్యాప్తంగా సంచలన సృష్టించిన తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై టీటీడీ ఫిర్యాదు మేరకు జరుగుతున్న సిట్ దర్యాప్తుకు బ్రేక్ పడింది. సిట్ దర్యాప్తు ఊపందుకుంటున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతానికి సిట్ విచారణను నిలిపివేస్తున్నట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. టీటీడీ లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు తరువాత దర్యాప్తుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని డీజీపీ వెల్లడించారు. మూడు రోజుల దర్యాప్తునకు సంబంధించిన నివేదికను సిట్ చీఫ్ అందజేశారని వివరించారు. న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా పోలీస్ శాఖ దర్యాప్తు కొనసాగుతుందని డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ విషయంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై టీటీడీ మాజీ ఛైర్మన్ ఎస్వీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీం విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. లడ్డూ కల్తీపై ఆధారాల్లేకుండానే సీఎం బహిరంగ ప్రకటన చేయడాన్ని సుప్రీం తప్పుబట్టింది. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి అంటూ చురకలు అంటించింది. ఈ ప్రభావం సిట్ దర్యాప్తుపైనా పడింది. చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత సిట్ దర్యాప్తు ప్రారంభం కావడంపై సుప్రీంకోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తుపై సీఎం వ్యాఖ్యల ప్రభావం ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ధర్మాసనం ఈ వ్యవహారంపై దర్యాప్తుకు సిట్ సరిపోతుందా ? లేక స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలా ? మీ అభిప్రాయం చెప్పండంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వతంత్ర సంస్థతో దర్యాప్తుకు సిద్ధపడింది. ఈ మేరకు మంత్రి డోలా వీరాంజనేయస్వామి స్పందిస్తూ కల్తీ నెయ్యి ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తాము న్యాయవ్యవస్థను గౌరవిస్తున్నట్లు చెప్పారు. అయితే తిరుమల శ్రీవారి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవమని పునరుద్ఘాటించారు.

ఆంక్షలులేని పంట రుణాలివ్వాలి: జమలయ్య

'చైతన్య' బ్యాంక్ వద్ద కౌలురైతుల ధర్నా

విశాలాంధ్ర- చింతలపూడి: కౌలు రైతులకు రుణ పరిమితులు పెంచి పంట రుణాలు మంజూరుచేయాలని, కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు సొంత పూచికత్తుపై రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద మంగళవారం సంఘ నేతల అధ్వర్యంలో కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం జమలయ్య మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.1.60 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వొచ్చని, కానీ బ్యాంకు అధికారులు దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. దీనివలన కౌలు రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తోందని, అధిక వడ్డీకి రుణం తీసుకొని అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఉదారంగా పంట రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ కే సుధీర్‌కి వినతి పత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, ఈ.ధర్మయ్య, రామిశెట్టి వెంకటేశ్వరరావు, శంకు సత్యనారాయణ, ఎస్.కె. కాలేశా, తాడిగడప మాణిక్యాలరావు, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

టీటీడీకి సొంత డెయిరీ అవసరం: రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమలలో సొంత డెయిరీ లేక 'కల్తీ' సమస్యలు వస్తున్నాయని బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. సొంత డెయిరీ ఏర్పాటుకు తన వంతుగా వెయ్యి ఆవులు ఇస్తానన్నారు. మరో లక్ష ఆవులు సమీకరించే బాధ్యతను తీసుకుంటానని తెలిపారు. లక్ష ఆవులతో డెయిరీ ఏర్పాటు చేస్తే రోజుకి 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి, 50వేల కిలోల వెన్న... 30 వేల కిలోల నెయ్యి తయారీ సాధ్యమవుతుందని సూచించారు. లక్ష గోవులతో గోశాల ఏర్పాటు చేస్తే 10వేల మంది గో సేవకులకు ఉపాధి లభిస్తుందని, యాదవ్ సామాజిక వర్గం వారిని నయమిస్తే సమర్థంగా పని చేయగలరని ఆయనన్నారు. తిరుమల పవిత్రత పరిరక్షణ ధ్యేయంగా సెప్టెంబర్ 27న పుంగనూరు నుంచి చేపట్టిన పాదయాత్రను మంగళవారం స్వామి దర్శనంతో తిరుమలలో రామచంద్ర యాదవ్ ముగించారు.

పట్టభద్రులపై పట్టుకు యుక్తులు!

ఉమ్మడి కృష్ణా-గుంటూరు వైసీపీ అభ్యర్థిగా గౌతమ్‌రెడ్డి

టీడీపీ టికెట్ 'ఆలపాటికేనని ప్రచారం

తూర్పు-పశ్చిమ ఎమ్మెల్సీ అభ్యర్థిపైనా కసరత్తు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన చంద్రబాబు ప్రభుత్వానికి, ఓటమి చవిచూసిన వైసీపీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సవాల్‌గా మారాయి. ఇప్పటికే ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్య నారాయణ బరిలో నిలిచి ఏకగ్రీవంగా గెలుపొందారు. టీడీపీ తరపున బలమైన అభ్యర్థిని బరిలోకి దించాలని ఆలోచించి... ప్రయత్నాలు చేపట్టి చివరకు బలం లేకపోవడంతో పోటీని విరమించారు. ఇప్పుడు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఓటర్ల నమోదు కు నోటిఫికేషన్ వెలువడింది. శాసన మండలిలో సరైన బలం లేని టీడీపీ...ఈ రెండు స్థానాలపై గురి పెట్టింది. ఎలాగైనా గెలుపొందేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఆ రెండు స్థానాలూ టీడీపీనే పోటీ చేస్తుందా లేక కూటమిలో ఉన్న జనసేన, బీజేపీకి ఒకటి ఇస్తుందా అనేదీ త్వరలో స్పష్టంకానుంది. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా పూనూరు గౌతమ్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో స్థానిక నేతలు, కార్యకర్తలతో పార్టీ అధినేత జగన్ చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు. 2014 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ వైసీపీ అభ్యర్థిగా గౌతమ్‌రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2019, 2024లో ఆయనకు టికెట్ దక్కలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ ఫైబర్ గ్రిడ్ చైర్మన్‌గా గౌతమ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే గౌతమ్‌రెడ్డి ఎన్నికల నిర్వహణలో నిమగ్నమయ్యారు. పామర్రు నియోజకవర్గంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్వర్యంలో ముఖ్యనేతలు భేటీ అయ్యారు. గౌతమ్‌రెడ్డి విజయం కోసం అందరూ శ్రమించాలని కోరారు. అదే స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజా బరిలో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయన పేరుతో పట్టభద్రుల ఓటర్ల నమోదు కోరుతూ ఒక కరపత్రం వెలువడింది. దీని ఆధారంగా ఆలపాటికే పార్టీ తరపున టికెట్ ఇస్తారన్న ప్రచారముంది. సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి సీటును పొత్తుల్లో భాగంగా జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. దీనిపై ఆలపాటి తీవ్రంగా వ్యతిరేకించి... అధిష్టానంపై తిరుగుబాటు చేసేంత వరకు వచ్చారు. దాన్ని గమించిన పార్టీ అధినేత చంద్రబాబు ఆయను దఫాలుగా పిలిపించి సర్దిచెప్పారు. ఆ తర్వాత నాదెండ్ల గెలుపు కోసం కృషి చేశారు. సీటు త్యాగం చేసినందుకుగాను ఆయనకు ఎమ్మెల్సీ టికెట్ ఇస్తారన్న ప్రచారముంది. కూటమి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అధికారికంగా ప్రకటించనప్పటికీ... ఈ సీటు ఆయనదేనని టీడీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తమ వైపే ప్రజలున్నారన్న ధీమాతో ఉంది. 100 రోజులు దాటినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలేదని, ఎన్నికల సమయానికి టీడీపీ కూటమిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్న అంచనాతో వైసీపీ ఉంది. ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిపై వైసీపీ కసరత్తు చేస్తోంది. కూటమి పార్టీలు అదే పనిలో ఉన్నాయి.

కేఎల్‌యూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికై జాతీయ స్థాయిలో నిర్వహిం చనున్న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష-2025 పోస్టర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష, విద్యా విధానం, మెరిట్ విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, స్కాలర్‌షిప్ విధానం గురించి యూనివర్సిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ విద్యార్థులు ఇటీవల సాధించిన ప్రగతి, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అంశాలపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సారథివర్మ, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సారథివర్మ మాట్లాడుతూ యూనివర్సిటీ అందించే ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై మూడు విడతలుగా దేశ వ్యాప్తంగా ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మొదటి విడత ప్రవేశ పరీక్షను డిసెంబర్ 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే అన్ని రకాల ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలకు ధీటుగా కేఎల్ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యం: దామోదర్ రావు

విశాలాంధ్ర-రేపల్లె: ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఏడు దశాబ్దాలుగా పోరాడుతున్నది ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు అన్నారు. స్థానిక ఉప్పూడి రోడ్డులోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్‌లో రేపల్లె ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ 70 ఏళ్ల పోరాట చరిత్రను దామోదర్ రావు గుర్తుచేశారు. రేపల్లె డిపోలో గతంలో వైసీపీ, నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్, ఇతర కార్మిక సంఘాలు ఉండేవన్నారు. వైసీపీ, నేషనల్ మజ్దూర్ యూనియన్‌లోని వంద మంది కార్మికులు తమ యూనియన్‌లో చేరడంతో ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి కమలాకర రావును కృషితోనే ఇది సాధ్యమైందని దామోదర్ రావు అభినందించారు. రేపల్లె డిపోలో కమలాకర రావు నాయకత్వంలో ఎంప్లాయిస్ యూనియన్ ఏకైక యూనియన్‌గా ఉండనుందని జోనల్ అధ్యక్షుడు వాకా రమేశ్ బాబు తెలిపారు. కమలాకర రావు మాట్లాడుతూ ఆర్టీసీలో 10,000 పోస్టుల భర్తీకి వెంటనే అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు సంబంధించి గత ప్రభుత్వం రద్దు చేసిన సర్క్యులర్ 1-2019ను యధావిధిగా అమలు చేయాలని, 2022 నుంచి ఆపేసిన నైట్ అవుట్ డైలీ అలవెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పదోన్నతులను పరిష్కరించాలని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలోగా బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి కమలాకర రావు సూచించారు. తొలుత దామోదర్ రావును యూనియన్ నాయకులు సత్కరించారు.

రేపటి నుంచే దసరా సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దసరా సెలవులు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యా సంచాలకులు వి.విజయరామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. 12న దసరా పండుగ. 10 రోజుల పాటు రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ రంగ, అనుబంధ పాఠశాలలు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు దసరా సెలవులు వర్తిస్తాయి. 14వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి.

జీఎంసీ బాలయోగికి సీఎం చంద్రబాబు నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లోక్‌సభ మాజీ స్పీకర్, జీఎంసీ బాలయోగికి సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. బాలయోగి 73వ జయంతిని పురస్కరించుకుని సీఎం సహా కొందరు ప్రముఖులు మంగళవారం ఆయనను నివాళులర్పిస్తూ ట్వీట్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు నిజమైన ప్రతినిధి అని చంద్రబాబు అన్నారు. కోనసీమకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బాలయోగి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ముందుకు రావాలని కోరారు. కోనసీమ ప్రగతి ప్రదాత, దళిత బాంధవుడు, లోక్‌సభ స్పీకర్ స్థానానికే వన్నెతెచ్చిన తెలుగు తేజం జీఎంసీ బాలయోగి అని, ఆయన సేవలు స్మరిస్తూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

సీఐడీకి నటి జెత్వానీ కేసు ?

నేడో, రేపో వెలువడనున్న ప్రభుత్వ ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఈరోజు, రేపటిలోగా ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద సోమవారం జరిగిన ఉన్నతస్థాయి భేటీలో ఈ కేసుపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో సీనియర్ పోలీసు అధికారులు నిందితులుగా ఉండటం, ఇతర రాష్ట్రాలతో లింక్‌ల నేపథ్యంలో సీఐడీకు ఇవ్వడం మంచిదని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే ప్రథమ నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నిందితులుగా ఉన్న అప్పటి విజయవాడ సీపీ క్రాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, దర్యాప్తు అధికారి సత్యనారాయణ ముందస్తు బెయిల్ కోసం హైకోర్ట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. కేసు రెండు రాష్ట్రాల్లో దర్యాప్తు చేయాల్సి ఉండటంతో సీఐడీకి ఇవ్వాలని ప్రభుత్వానికి అధికారులు సూచించారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని నేడు, రేపటిలోగా ప్రభుత్వం నిర్ణయం ఉత్తర్వులను ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

ఐపీఎస్‌ల ముందస్తు బెయిల్‌పై రేపటికి వాయిదా

జత్వానీ కేసులో ఐపీఎస్‌లు, ఏసీపీ, సీఐ ముందస్తు బెయిల్ పిటిషన్‌లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ల తరపు వాదనలు ముగిశాయి. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. అడ్వకేట్ జనరల్ అదేరోజు వాదనలు వినిపించనున్నారు. మరో వైపు ఈ కేసులో రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా విచారణ జరిగింది. తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా పడింది.

హోం, రక్షణ శాఖల పార్లమెంటరీ కమిటీల్లో విజయవాడ ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్లమెంటరీ స్థాయీ సంఘాలను పునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ తెలిపారు. ఈ వివరాలను లోక్ సభ సెక్రటరీ జనరల్ ఇటీవల పి.సి. మోదీ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ కమిటీల్లో తెలుగు రాష్టాల నుంచి స్థానం దక్కించుకున్నారు. అందులో ముఖ్యంగా విజయవాడ లోక్‌సభ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) హోంశాఖ, రక్షణ శాఖ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నట్లు గెజిట్ పేర్కొంది.

స్థానిక సమస్యల పరిష్కారానికి పల్లెనిద్ర: జాఫర్

విశాలాంధ్ర-కూడేరు: గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకొని వాటిని అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే సీపీఐ అధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ తెలిపారు. పార్టీ బలోపేతం చేసుకోవడమే కాకుండా క్షేత్రస్థాయి ప్రజలు, రైతుల సమస్యలు తెలుసుకునేందుకు, సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు పల్లె నిద్ర దోహదమవుతుందని అన్నారు. పి.నారాయణపురం శాఖ కార్యదర్శి చిన్న ఓబులేసు అధ్యక్షతన జరిగిన శాఖ సమావేశం అనంతరం పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని జాఫర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పి.నారాయణపురం నుంచి కరుట్లపల్లి హైస్కూల్‌కు వెళ్లాలంటే ఆటోలకు వందల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని, కూలి పనులు చేసేకునే తమకు ఇది భారమవుతోందన్నారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కంది, ఆముదం పంటలు పండించే రైతులకు ఎకరానికి 15 వేల రూపాయలు ఖర్చు తప్ప... పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వంటివి లభించడంలేదన్నారు. అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి సత్వర పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని జాఫర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మల్లిఖార్జున (సీపీఐ), నీళ్ల వరప్రసాద్ (రైతు సంఘం), రాయుడు (వ్యవసాయ కార్మిక సంఘం) పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్‌లో రూ.78.77 లక్షలు మాయం

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్: నంద్యాల జిల్లా ఆత్మకూరు కేడీసీసీ బ్యాంక్‌లో క్యాషియర్ అల్తాఫ్ చేతివాటం ప్రదర్శించాడు. రెండు నెలల కాలంలో రూ.78.77 లక్షలు మాయం చేశాడు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ పెద్దపులి రాజు మాట్లాడుతూ రోజువారీ లావాదేవీల అనంతరం క్యాషియర్ బ్యాంక్ సొమ్మును స్ట్రాంగ్ రూంలో భద్రపర్చాల్సి ఉంటుందని, అయితే క్యాషియర్ తన సొంత అవసరాలకు బ్యాంక్ సొమ్మును రోజూ కొంత కాజేయడం మొదలుపెట్టాడని తెలిపారు. రోజువారి బ్యాంక్ సొమ్మును వెరిఫికేషన్ చేయాల్సిన పాసింగ్ ఆఫీసర్ (పీఓ) సైతం క్యాషియర్ చేతివాటం వ్యవహారాన్ని చూసీచూడనట్లుగా వదిలేశాడని, దీంతో క్యాషియర్‌ను, పీఓను సస్పెండ్ చేసినట్లు ఆయన వివరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

కానిస్టేబుళ్ల నియామకాల ప్రకటనపై లోకేశ్ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కానిస్టేబుల్ పోస్టుల్లో నియామకాల కోసం ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించడంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తంచేశారు. ఎక్స్ మాధ్యమంగా ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిలిమినరీ పరీక్ష తరువాత నియామకాల రెండవ దశలో జరగాల్సిన శారీరక ధారుఢ్య పరీక్షలు వేర్వేరు కారణాలతో వాయిదా పడ్డాయనే అంశాన్ని ప్రజా దర్బార్‌కు వచ్చిన నిరుద్యోగులు ఫిర్యాదు చేయడంతో హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మంత్రి అనిత సానుకూలంగా స్పందించి నియామకాల ప్రక్రియలో పెండింగ్ దశలు ప్రారంభిస్తామని ప్రకటించారని లోకేశ్ తెలిపారు. ఇది కానిస్టేబుల్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారు సంతోషించే సమాచారమని లోకేశ్ పేర్కొన్నారు.

జోగి రమేశ్‌కు మళ్లీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీమంత్రి జోగి రమేశ్‌కు మళ్లీ నోటీసులు జారీ అయ్యాయి. చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనను విచారణకు రావాలంటూ పోలీసులు గతంలోనూ నోటీసులు ఇచ్చారు. తాజాగా నోటీసులు జారీ చేశారు. మంగళగిరి డీఎస్పీ కార్యాలయానికి బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల లోపు హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు.

సంపాదకీయం

ఇజ్రాయిల్ యుద్ధ పిపాస

పలస్తీనియన్ జాతినే అంతం చేయాలన్న ఉద్దేశంతో గత ఏడాది అక్టోబర్ 8 తరవాత గాజా మీద అగ్నివర్షం కురిపించి వేలాది మందిని పొట్టన పెట్టుకున్న ఇజ్రాయిల్ ఇప్పుడు లెబనాన్ మీద యుద్ధం మొదలు పెట్టింది. మంగళవారం ఉదయం ఇజ్రాయిల్ సేనలు దక్షిణ లెబనాన్‌లోకి ప్రవేశించాయి. హెజ్బొల్లా మిలిటెంట్ల మీద ఇజ్రాయిల్ దళాలు తీవ్ర దాడి కొనసాగిస్తున్నాయి. గాజాను నుగ్గు నుగ్గు చేసిన తరవాత ఇజ్రాయిల్ హెజ్బొల్లా మిలిటెంట్లను తుదముట్టించే నెపంతో లెబనాన్ మీద దాడికి దిగింది. హెజ్బొల్లాకు ఇరాన్ మద్దతు ఉంది కనక ఎలాగైనా రెచ్చగొట్టి ఇరాన్‌ను కూడా యుద్ధానికి ప్రేరేపించాలన్నది ఇజ్రాయిల్ అసలు వ్యూహం. ఇప్పటికే ఇజ్రాయిల్ ఆగడాలు ఏడాదిగా ఆ ప్రాంతాన్నంతటినీ అతలాకుతలం చేశాయి. లెబనాన్ మీద దాడికి దిగడం గాజా మీద కొనసాగించిన దాడిని లెబనాన్‌కు విస్తరింప చేయడమే. ఇంతకాలం లెబనాన్‌లో ఉన్న హెజ్బొల్లాను సమర్థించిన ఇరాన్ కూడా ముగ్గులోకి లాగితే ఆ ప్రాంతమంతా నెత్తురుటేరులు పారక తప్పదు. అనేక దేశాల్లో తీవ్రవాదులు ఉండొచ్చు. తీవ్రవాదులను ప్రోత్సహించే దేశాలూ ఉండొచ్చు. కానీ ఒక దేశం, అక్కడి పాలకవర్గం తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడడం ఒక్క ఇజ్రాయిల్ విషయంలోనే కనిపిస్తుంది. నిస్సందేహంగా ఇజ్రాయిల్ తీవ్రవాద దేశం అని అరబ్బుల ప్రాంతంలో ఇజ్రాయిల్ అస్తిత్వంలోకి వచ్చిన దగ్గర నుంచి రుజువు అవుతూనే ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత బ్రిటన్, అమెరికా లాంటి దేశాలు యూదులకోసం పలస్తీనా సరసన కృత్రిమంగా ఒక దేశమే ఏర్పడేట్టు చేశాయి. అదే ఇజ్రాయిల్ దేశంగా అవతరించిన నాటి నుంచి పశ్చిమ దేశాలు, ప్రధానంగా అమెరికా ఇజ్రాయిల్‌కు పీకలదాకా ఆయుధాలు సరఫరాచేసి ఇజ్రాయిల్‌ను నరహంతక దేశంగా తయారుచేశాయి. అమెరికా అండతో ఇజ్రాయిల్ పెట్రేగిపోతోంది. ఇలా కయ్యానికి కాలు దువ్వడం ఇదే మొదటి సారి కాదు. ఇజ్రాయిల్ ఆగడాలవల్ల ఈ పరిస్థితి గత ఏడెనిమిది దశాబ్దాల కాలంగా ఎన్నోసార్లు తలెత్తింది. గతంలో 2006లో ఇజ్రాయిల్ హెజ్బొల్లాకు వ్యతిరేకంగా భూతలయుద్ధానికి పాల్పడింది. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా దళాలపై పరిమితయుద్ధం కొనసాగిస్తున్నామని ఇజ్రాయిల్ చెప్పుకుంటున్నప్పటికీ ఇజ్రాయిల్ తత్వాన్ని గమనిస్తే అది పరిమిత యుద్ధంగా మిగలదు. ఆ సెగలు పొరుగున ఉన్న దేశాలనూ ఆవరిస్తాయి. పదిహేను రోజుల కిందటి నుంచే హెజ్బొల్లా మిలిటెంట్లు వాడే పేజర్లు, వాకీ టాకీలు పేలిపోయేట్టు ఇజ్రాయిల్ కుట్ర పన్నింది. ఇందులో వందలాది మంది హెజ్బొల్లా కార్యకర్తలు మరణించారు. ఆ తరవాత హెజ్బొల్లా నాయకుడు నస్రల్లాను, ఆ తరవాత మరో నాయకుడిని ఇజ్రాయిల్ హతమార్చింది. ఈ అఘాయిత్యాన్ని ప్రతిఘటించడానికి హెజ్బొల్లా సిద్ధపడడంలో ఆశ్చర్యకరమైంది ఏమీ లేదు. ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడుల్లో కూడా అనేకమంది హెజ్బొల్లా కమాండర్లు నేలకొరిగారు. ఈ దారుణాలన్ని చూస్తుంటే ఇజ్రాయిల్ కొనసాగిస్తున్నది యుద్ధం కాదు పనిగట్టుకుని మారణకాండకు పాల్పడుతోంది అని రుజువు అవుతోంది. యూదులను తప్ప తమ సరసన మరే జాతి వారికి అవకాశం లేకుండా చేయాలన్నది ఇజ్రాయిల్ పంతం.

హెజ్బొల్లా వెనక్కు తగ్గకుండా తమకు ఉన్న పరిమితుల్లో ఇజ్రాయిల్ ఆగడాలను ఎదుర్కోవడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ మీదికి రాకెట్లు, ఓ మోస్తరు క్షిపణులు ప్రయోగిస్తోంది. అయితే హెజ్బొల్లాకు వైమానిక దాడులు చేసే అవకాశం లేదు. 2006 నాటి యుద్ధం తరవాత ఆమోదించిన తీర్మానం ప్రకారం హెజ్బొల్లా దళాలు ఇజ్రాయిల్ సరిహద్దు నుంచి కనీసం 30 కి.మీ. వెనక్కు వెళ్లిపోవాలని ఇజ్రాయిల్ వాదిస్తోంది. కాని అనునిత్యం ఇజ్రాయిల్ కయ్యానికి దిగుతున్నప్పుడు హెజ్బొల్లా దళాలు వెనక్కు తగ్గాలనడం కేవలం వితండవాదమే. ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం ఇజ్రాయిల్‌కు లేనప్పుడు ఇతరులు ఆ పని చేయాలనడం వైపరీత్యమే. ఇజ్రాయిల్ దాడి తప్పదని గ్రహించిన లక్షలాది మంది లెబనాన్ పౌరులు కొద్ది వారాల కిందటి నుంచే తమ నివాసాలు వదిలి సురక్షితం అనుకున్న చోట్లకు తరలి పోయారు. కానీ అపారమైన ఆయుధ సంపత్తి, అన్నింటికన్నా మించి అగ్రరాజ్యమైన అమెరికా అండ ఉన్న ఇజ్రాయిల్ లోతట్టు ప్రాంతాలలో కూడా దాడి చేయదు అన్న హామీ ఎటూ లేదు. హెజ్బొల్లాకు వైమానిక శక్తి లేకపోవడంవల్ల ఇజ్రాయిల్ ఇష్టానుసారం దాడి చేయడం సులభం అవుతోంది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ రక్త దాహం తీర్చుకోవడం కొత్తేమీ కాదు. పలస్తీనా మిలిటెంట్ల మీద దాడి పేరుతో 1978 లో లెబనాన్ మీద ఇజ్రాయిల్ దాడికి దిగింది. ఆ తరవాత 1982 లో మరోసారి దాడిచేసి దాదాపు దక్షిణ లెబనాన్‌ను ఆక్రమించింది. తమకు బద్ధ శత్రువు అనుకునే ఇరాన్‌ను ముగ్గులోకి లాగాలన్నదే ఇజ్రాయిల్ అసలు వ్యూహం. హౌతీ మిలిటెంట్ల మీద దాడి చేయడంలో భాగంగా గతంలో ఇజ్రాయిల్ యెమెన్ మీద వైమానిక దాడులు చేసింది. తమకు పశ్చిమాసియాలోని ఏ దేశం మీదైనా దాడి చేయగల సామర్థ్యం ఉందని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ విర్రవీగుతూనే ఉన్నారు. లెబనాన్ మీద ఇజ్రాయిల్ మొదలు పెట్టిన కిరాతకం ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియదు. నిరాశ్రయులైన ఇజ్రాయిలీలు సురక్షితంగా స్వదేశం తిరిగి వచ్చే దాకా దాడులు కొనసాగుతాయని ఇజ్రాయిల్ బాహాటంగానే ప్రకటిస్తోంది. ఇజ్రాయిల్ కసి హెజ్బొల్లా మీదే కావచ్చు కానీ లెబనాన్‌కు కూడా అపార నష్టం అనివార్యం. ఇరాన్ మీద దాడి చేయాలని ఇజ్రాయిల్ అనేక ఏళ్ల నుంచి అమెరికాను ప్రేరేపిస్తోంది. అదే జరిగితే ఇప్పటికే పశ్చిమాసియాలో ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉన్న అమెరికా దళాల సంఖ్య భారీగా పెరగడం అనివార్యం. యుద్ధం నివారించాలని ఇరాన్ కోరుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇజ్రాయిల్ దగ్గర అణ్వస్త్రాలున్నాయి. నెతన్యాహూ లాంటి యుద్ధ పిపాసి ఇజ్రాయిల్ అధిపతిగా ఉన్నప్పుడు అణ్వస్త్రాలు వినియోగించకూడదన్న నియమానికి కట్టుబడి ఉంటాడన్న పూచీ లేదు. ఒక వేళ ఇజ్రాయిల్ ఆ దుస్సాహసానికే దిగితే 1945 తరవాత అణ్వస్త్ర ప్రయోగం ఇదే మొదటి సారి అవుతుంది. ఇజ్రాయిల్ ఎంతకైనా తెగిస్తుందని ఇరాన్‌కు తెలుసు కనక తమ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖామేనీని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఇరాన్ యుద్ధ రంగంలోకి దిగడం అనివార్యమైన పరిస్థితి ఎదురైతే లక్షలాది మంది ప్రాణాలు బలైపోవడం ఖాయం. దీనికి పూర్తి బాధ్యత ఇజ్రాయిల్‌ను వెనకేసుకొస్తున్న అమెరికా, బ్రిటన్ దేశాల మీదే ఉంటుంది. అన్నింటికన్నా మించి ఏదో ఒక మూల యుద్ధం జరిగితేనే అమెరికా ఆయుధ వ్యాపారం వృద్ధి చెందుతుంది. ఆయుధ బేహారులకు మానవత్వం ఉండదు అని రెండవ ప్రపంచ యుద్ధం తరవాత అనేక సార్లు రుజువైంది. తీవ్రవాద దేశమైన ఇజ్రాయిల్ అమెరికా చేతిలో పావు మాత్రమే. ఇజ్రాయిల్‌కు ఉన్న జాతి వివక్ష మరింత ఆజ్యం పోయడానికి దోహదం చేస్తోంది.

అందరి మనిషి ఏబీ బర్ధన్

సురవరం సుధాకరరెడ్డి
సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి

ఏబీ బర్ధన్ (అర్ధేందు భూషణ్ బర్ధన్) జన్మించి 100 సంవత్సరాలు అయింది. వారి కుటుంబం రెండు తరాల ముందు బంగ్లాదేశ్ నుంచి ఆనాటి మధ్యభారత్‌లోని నాగపూర్‌కు వచ్చి అక్కడ స్థిరపడ్డారు. విద్యార్థిగా ఉండగానే బర్ధన్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు నాగపూర్ పట్టణ పార్టీ కార్యదర్శి హెచ్.కె.వ్యాస్ నుంచి పార్టీలో సభ్యత్వం పొందారు. బర్ధన్ నాగపూర్ యూనివర్సిటీ నుంచి ఎంఏ ఎకనామిక్స్, లా డిగ్రీ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ నాయకుడిగా పనిచేశారు. అనేక దశాబ్దాల పాటు ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పనిచేశారు. లోతైన సిద్ధాంతపరమైన పరిజ్ఞానం కలిగిన కమ్యూనిస్టు నాయకుడు. ఆయన అద్భుతమైన వక్త. ఆయన ప్రసంగాలు ప్రజలను ప్రభావితం చేసేవి. మహారాష్ట్ర శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు, పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు వెళ్లమని కోరినప్పుడు ఆయన నిరాకరించారు. జీవితమంతా పార్టీకి అంకితం చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.

బర్ధన్‌తో దాదాపు 20 సంవత్సరాలపాటు కలిసి పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఆయన భార్య చనిపోయిన తర్వాత, పూర్తి కాలం అజయ్ భవన్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉండేవారు. ఆయన కుమార్తె డాక్టర్ అల్కా, అల్లుడు అహ్మదాబాదులో ఐఐటి డైరెక్టర్. కుమారుడు అశోక్ బర్ధన్ ప్రొఫెసర్. ఒకసారి ఆయనకు ఆపరేషన్ జరిగినప్పుడు పార్లమెంట్ సభ్యుడిగా నాకు ఉన్న క్వార్టర్స్‌లో ఉండమని కోరితే, ఆయన అంగీకరించారు. దాదాపు ఐదారు సంవత్సరాలు మేము కలిసి ఉన్నాం. నేను వీపీ హౌస్‌లో సింగిల్ రూమ్‌కు మారేవరకు కలిసే వున్నాం. ఆయన ఎంత నిరాడంబర జీవితం గడుపుతారో ఆ రోజుల్లో బాగా అర్థమైంది. మేము కార్యాలయంలోనూ, సాయంకాలం ఇంట్లోనూ సైద్ధాంతిక రాజకీయ సమస్యలపై నిరంతరం చర్చించుకునేవాళ్లం. ఆయన దగ్గర నేను అనేక విషయాలను నేర్చుకున్నాను. ఆయన మార్క్సిజం, భారత రాజకీయాల గురించి నాకు అనేక విషయాలు వివరించేవారు.

"భారతీయ జనతా పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ గడ్కరి ఒక రోజు, హఠాత్తుగా మా ఇంటికి వచ్చారు. ఆర్.ఎమ్.ఎల్. హాస్పిటల్ ఎదురుగా మాకు కేటాయించిన ఇంట్లో నేను ఆశ్చర్యపోయి చూస్తుండగా, ఆయన 'నేను బర్ధన్ గారికి శిష్యుడ్ని. భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవిని స్వీకరించిన తర్వాత ఆయన ఆశీర్వాదం తీసుకోవడానికి వచ్చాను" అని అన్నారు. ఆయన బర్ధన్ గారికి పాదాభివందనంచేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. దాదాపు ఒక గంటసేపు విభిన్న విషయాలపై చర్చించారు. ఆయన వెళ్తూ నాకు కొన్ని పుస్తకాలు ఇచ్చారు. ఈ విధంగా, బర్ధన్ గారు విభిన్న రాజకీయ పార్టీల నాయకుల గౌరవాన్ని పొందినటువంటివారు. ఎన్సీపీ నాయకులు శరద్ పవార్ ఆయనకు సన్నిహిత మిత్రులు. చాలా సరదాగా అనేక జోక్స్ చెప్పుకునేవారు.

కామ్రేడ్ సూర్జిత్ గారు సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు వారిద్దరూ చాలా సన్నిహితంగా ఉండేవారు. ఆయనకు మరొక స్నేహితుడు మాజీ ప్రధానమంత్రి వీపీ సింగ్. వీపీ సింగ్‌ని కలవడానికి అనేకసార్లు బర్ధన్ నన్ను కూడా వెంట తీసుకెళ్లేవారు. యూపీఏ ప్రభుత్వాన్ని సిపిఐ, సిపిఎం బయట నుండి బలపరుస్తున్న రోజుల్లో, ఆయన మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించడానికి వామపక్ష, సెక్యులర్ ప్రజాతంత్ర పార్టీల ఐక్యత అవసరమని వివరించి యూపీఏ ప్రభుత్వాన్ని బలపరిచేందుకు పార్టీని ఒప్పించారు. వామపక్షాల ఐక్యతకోసం ఆయన తీవ్రమైన కృషి చేశారు. సీపీఎం నాయకులు ప్రకాశ్ కరాత్, సీతారాం ఏచూరి, ఇతర నాయకులు కూడా ఆయనను చాలా గౌరవించేవారు. అనేక సమస్యలపై ఆయనతో చర్చించి సలహాలు తీసుకొనేవారు. 2004లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వామపక్షాలు బయట నుంచి మద్దతిచ్చాయి. దానికి షరతు కనీస ఉమ్మడి కార్యక్రమం. ఉభయ కమ్యూనిస్టు పార్టీల తరఫున బర్ధన్, సీతారాం ఏచూరి, ప్రకాశ్ కారత్, డి. రాజా ఆ కమిటీలో ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా కమిటీలో ఉన్నారు. ముసాయిదా తయారుచేయడంలో బర్ధన్, సీతారాం ఏచూరి ప్రధాన పాత్ర వహించారు. అందులో కొన్ని ముఖ్యమైనవి గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, గృహహింస నిరోధక చట్టం, అటవీ హక్కుల చట్టం తదితరాలు. దాని వల్ల యూపీఏ ప్రభుత్వ గౌరవం పెరిగింది.

> ఒక పర్యాయం, జనరల్ ఎన్నికల ముందు, టాటా ఎన్నికల ట్రస్ట్ నుంచి విరాళంగా డ్రాఫ్టు తీసుకుని వచ్చారు. దాదాపు 15, 20 లక్షలని గుర్తు. బర్ధన్ వారికి టీ ఇప్పించి కార్పొరేట్ల దగ్గర పార్టీ నిధులు తీసుకోవద్దని, చెప్పి డ్రాఫ్ట్ వారికి తిరిగి ఇచ్చి పంపేశారు.

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో ఎవరైనా మహిళపేరు సూచించమని సోనియా గాంధీ వామపక్షాలను కోరారు. సీపీఎం ఆ బాధ్యత బర్ధన్ మీద పెట్టింది. ఆయన రెండు, మూడుపేర్లు సూచించారు. ఆఖరికి ఆయన సూచించిన ప్రతిభా పాటిల్ పేరును సోనియా గాంధీ, మన్‌మోహన్ సింగ్ అంగీకరించారు.

కేరళలో పార్టీ రాష్ట్ర మహాసభలకు వెళ్లినప్పుడు, మా ఇద్దరికీ, ఒక స్టార్ హోటల్‌లో గదులు ఇచ్చారు. ఒక రాత్రి ఉన్న తర్వాత ఆయన మహాసభ ప్రతినిధులు ఉన్న బసకు మార్చమని కోరారు. ఆ హోటల్ గదులు ఉచితంగా ఇచ్చారని చెప్పినా, అది మరీ విలాసవంతంగా ఉందని బస మార్పించారు. అజయ్ భవన్ గేటు ముందు మంగలితో క్షవరం చేయించుకునేవారు. గేటు పక్కన చెప్పులు కుట్టుకునే కామ్రేడ్ తార వచ్చి పార్టీ ఆఫీస్ క్యాంటీన్‌లో మాతోపాటు భోజనం చేసేవాడు. అతడు పార్టీ సభ్యుడు. అతను షూస్‌కుడితే అందంగా, మన్నికగా ఉండేవి. సాయంకాలం పూట బర్ధన్ అజయ్ భవన్ గ్రౌండ్ ఫ్లోర్‌లో రెడ్ గార్డులతో కూర్చొని టీ తాగుతూ మాట్లాడేవాడు వారి కుటుంబ ఫంక్షన్లకు బర్ధన్, పల్లబ్, నేను వెళ్లే వారం.

బర్ధన్ అనేక సంవత్సరాలపాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన తర్వాత, హైదరాబాదులో 2008లో జరిగిన పార్టీ మహాసభలో నన్ను ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అంతకుముందు గిరిప్రసాద్ ఆ బాధ్యతలు నిర్వహించారు. అప్పటినుంచి మేము కలిసి పని చేశాం. అంతకుముందు, నేను పార్టీ సెక్రటేరియట్‌లో దాదాపు పది సంవత్సరాలు పనిచేశాను. 2012లో పాట్నాలో జరిగిన పార్టీ మహాసభ సందర్భంగా, ఆయన నన్ను ప్రధాన కార్యదర్శి పేరుకు ప్రతిపాదించినప్పుడు, నా ఆరోగ్యం రీత్యా, తర్వాత నాకు ఉన్నటువంటి పరిమితుల దృష్ట్యా బాధ్యత నెరవేర్చలేనని ఆయనతో చెప్పాను. కానీ, ఆయన, "నేను నీ సలహా అడగలేదు, నీ అనుమతి అడగలేదు" అన్నారు. సహజంగా, నాకంటే సీనియర్లు పార్టీ నాయకత్వంలో ఉండేవారు. వారందరినీ ఒప్పించి, ఆయన నన్ను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసి, ఆ తర్వాత నేను నా బాధ్యతలు కొనసాగించేందుకు అవసరమైన నిరంతర సహాయం చేసేవారు. ఇతర కామ్రేడ్స్‌ను వ్యాసాలు, బుక్లెట్స్ రాయమని ప్రోత్సహించేవారు. డి.రాజాతో దళిత సమస్యలపై, షమీమ్ ఫైజితో మైనారిటీ సమస్యలపై బుక్లెట్స్ రాయించారు. వివిధ అంశాల మీద వ్యాసాలు రాయమని నాకు సలహా ఇచ్చేవారు. ఆయన బెంగాలీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ భాషలు అనర్గళంగా మాట్లాడేవారు.

పార్టీ ఆఫీసులోనే మేము పక్కపక్క గదుల్లోనే ఉండేవారం. ఆయనతో చర్చించే చాలా విషయాలు నిర్ణయించే వారం. కొంతకాలం తర్వాత, ఆయన నిర్ణయాలు ప్రతిసారి నాతో చర్చించాల్సిన అవసరం లేదు. అత్యవసరమైనప్పుడే నాతో చర్చించండి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోండి అని చెప్పారు. అయితే, మా కోరిక మీద ఆయన పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గంలో కొనసాగారు. ఆ తర్వాత, పార్టీ ప్రోగ్రాం కమిషన్ శాశ్వతచైర్మన్‌గా ఆయనను ఎన్నుకున్నాం. వాస్తవానికి, కమ్యూనిస్టు పార్టీకి చాలాకాలం పార్టీ ప్రోగ్రాం మీద ఒక సమస్య ఉండేది. మారుతున్న పరిస్థితులను బట్టి, పార్టీ కార్యక్రమం పదేళ్లకు ఒకసారి లేదా 15 సంవత్సరాలకు ఒకసారి మారాలి.

హైదరాబాదులో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో పార్టీ ప్రోగ్రాంకు సంబంధించిన ఒక డాక్యుమెంట్‌ను మాత్రమే తయారుచేశాం, కానీ పూర్తి ప్రోగ్రాం తయారు కాలేదు. పార్టీ కార్యవర్గం కోరిక మేరకు బర్ధన్ పార్టీ ప్రోగ్రాం తయారుచేసి, దానిని కార్యవర్గం, కౌన్సిల్ ముందుంచారు. ఆఖరికి పుదుచ్చేరిలో జరిగిన జాతీయ మహాసభలో కూలంకషంగా చర్చించి, దాన్ని అంగీకరించారు. నేను, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, డి.రాజా, అతుల్ కుమార్ అంజన్, పలవ్‌సేన్ గుప్తా ప్రోగ్రాం కమిషన్‌లో వున్నప్పటికీ ప్రధాన డ్రాఫ్ట్ బర్ధన్ తయారుచేశారు. ఈ ప్రోగ్రాం కమ్యూనిస్టు పార్టీకి మరింత స్పష్టతను తెచ్చింది. బర్ధన్ పార్టీకి చేసిన కాంట్రిబ్యూషన్‌లో ఇదొక ప్రధానమైన అంశం.

ఉత్తర భారతదేశంలో పార్టీ నిర్మాణం మీద ఆయన ప్రతేక శ్రద్ధ పెట్టారు. బీహార్ ఒకప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీకి ఒక బలమైన కేంద్రం. అయితే, విభిన్న కారణాలవల్ల, ముఖ్యంగా కుల రాజకీయపార్టీల వల్ల పార్టీ బలహీనపడింది. ఆయన బీహార్‌లో పార్టీ మహాసభ జరుపుదామని నిర్ణయించారు. బీహార్‌లో పార్టీ నిర్మాణం బాగోలేదని, చేయగలమా అని అందరికీ అనుమానం కలిగింది. సంవత్సరంపాటు ఆయన నెలకు ఒక వారం పది రోజులు బీహార్ వెళ్లి, జిల్లాల్లో కూడా పర్యటించి స్థానిక నాయకులకు మార్గనిర్దేశం చేసి, వారికి ఆత్మవిశ్వాసం కలిగించారు. బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఆయన జిల్లాలకు బస్సుల్లో, మోటార్ సైకిల్ మీద ప్రయాణం చేసేవారు. ఒక పర్యాయం ఢిల్లీ నుంచి మేము రైలులో మధుబని వెళ్లేందుకు స్టేషన్‌కు వెళ్తే మా ట్రైన్ రద్దయింది. ఎండాకాలం 43 డిగ్రీల వేడి. తర్వాత రైలుకు వెళ్దామనీ, రిజర్వేషన్ లేకపోయినా పర్లేదు అని ఆయన పట్టుబట్టారు. కాసేపటికి వడగాలికి ఆయన స్పృహ తప్పారు. నేను చాలా భయపడ్డాను. కొద్ది నిమిషాల్లోనే తేరుకున్నారు. అయినా ప్రయాణం చేయాలన్నారు. ఆ రైల్లో రద్దీవల్ల ఎక్కలేకపోయాం. ఆయనను గుర్తుపట్టిన ఒక ఫాదర్ చక్రాల కుర్చీ తెప్పించి బయట టాక్సీలో ఆఫీస్‌కు పంపించారు. ఆ రాత్రి విమానంలో పాట్నా వెళ్లాం. ఆ పార్టీ కాంగ్రెస్ విజయవంతంగా జరిగింది. 1967లో జరిగిన పాట్నా మహాసభలకు ధీటుగా ప్రజలు లక్షల సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొన్నారు. పార్టీ నిర్మాణం మెరుగుపడింది. ఆ మహాసభల్లోనే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి పదవినుంచి రిలీవ్ అయ్యారు. దళితులు, గిరిజనుల సమస్యల మీద ఆయన ప్రత్యేక శ్రద్ధపెట్టారు. పాట్నాలో మహాసభ తర్వాత, ఆయన సూచన మేరకు, నాగపూర్‌లో దళితుల సమస్యలమీద ఎస్సీ కాంపోనెంట్ గురించి జాతీయసదస్సు ఏర్పాటు చేశాం. గిరిజనుల సమస్యలమీద ఆయన చాలా మంచి పుస్తకాలు రాశారు. మైనారిటీల సమస్యల మీద ఆయన రాసిన పుస్తకాలు పార్టీ కార్యకర్తలకు శిరోధార్యం అయ్యాయి. గిరిజన సంఘాన్ని పునరుద్ధరించారు

బర్ధన్ లాంటి నాయకులు పార్టీకి నాయకత్వం వహించడం గర్వకారణం. ఆయన కోరుకున్న శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ, వామపక్ష పునర్ ఐక్యత సాధించడానికి మనం ఈ శతాబ్ది ఉత్సవం సందర్భంగా మరోసారి ప్రతిజ్ఞ చేద్దాం.

కామ్రేడ్ బర్ధన్‌కు రెడ్ సెల్యూట్!

> కామ్రేడ్ బర్ధన్ చాలా నిరాడంబర జీవి. ఆయనా నేను ఇద్దరం వివిధ రాష్ట్రాలలో పర్యటన చేస్తున్న సందర్భంగా, పాట్నాలో మన పార్టీ శాసనసభ్యుడి ఇంట్లో ఉండేవారం. అక్కడ మేము పార్టీ ఆఫీస్‌కి వెళ్లి తిరిగి సాయంకాలంవచ్చి వారి ఇంట్లో విశ్రాంతి తీసుకునేవారం. ఆ సందర్భంగా బర్ధన్ అనేకమంది ఇతర కమ్యూనిస్టు నాయకుల్లాగా తన బట్టలు తనే ఉతుక్కునేవారు. మేమిద్దరం బట్టలు ఉతుక్కుని ఆరేసి వెళ్లి వచ్చేవారం. ఒకసారి బర్ధన్ గారి బనియన్ కనబడలేదు. ఆయన వాళ్ళ అమ్మాయిని అడిగారు. వారి అమ్మాయి, 'బనియన్ పడేశాను, చినిగిపోయిన బనియన్లు ఎన్ని రోజులు పెట్టుకుంటారు? "అంకుల్ ఇది నాకేమీ బాగోలేదు మార్కెట్‌కెళ్లి ఒక మూడు కొత్త బనియన్లు కొనుక్కుని వచ్చాను" అని తీసుకొచ్చి ఇచ్చింది. అలాగే మేము ఢిల్లీలో ఉన్నప్పుడు, బర్ధన్‌కి అవసరమైన బట్టలు కొన్ని నా భార్య విజయలక్ష్మి తీసుకొచ్చి ఆయనకు ఇచ్చేది. ఎందుకమ్మా ఇవన్నీ తెస్తారు 'ఇవన్నీ ఇంకా బాగున్నాయి, పాత బట్టలను పడేయాల్సిన అవసరం లేదు' అని ఎప్పుడూ అనేవారు. మా కుటుంబాలతో ఆయన చాలా ఆప్యాయంగా వుండేవారు. మా కుమారుల వివాహానికి హైదరాబాద్ వచ్చి ఆయన, చంద్రబాబు సాక్షి సంతకాలు చేశారు.



> ఆయన పార్టీ కార్యదర్శి కంటే ముందు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కార్మిక సమస్యల మీద ఆయనకు లోతైన అవగాహన ఉండేది. బర్ధన్, తన తోటి కామ్రేడ్స్ పట్ల చాలా ప్రేమపూర్వకంగా ఉండేవారు. పార్టీ ఆఫీసులో పనిచేసే ఉద్యోగస్తులతో ఆయన చాలా ఆప్యాయంగా, ప్రేమగా ఉండేవారు. వారికి కుటుంబ సమస్యలు వచ్చినప్పుడు ఆర్థికసహాయం చేసేవారు. శాసనసభ్యుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా వచ్చిన పెన్షన్ మొత్తాన్ని దాదాపు 13 లక్షల రూపాయలను భారత కమ్యూనిస్టు పార్టీకి విరాళంగా ఇచ్చారు.

నేటికి శిరోధార్యం గాంధీజీ సిద్ధాంతాలు

పిన్నక సాంబశివరావు

ఎంతోమంది ప్రజల, ఉద్యమకారుల, జాతీయ నాయకుల, స్వాతంత్ర్య సమరయోధుల, పోరాట త్యాగ ఫలితంగా భారతదేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించింది. అటువంటి మహానుభావుల్లో జాతిపిత మహాత్మా గాంధీజీ సుప్రసిద్ధుడు. ఆంగ్లేయపాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధింపచేసిన నాయకులలో గాంధీ అగ్రగణ్యుడు. ప్రజలు ఆయన్ని "మహాత్మ, జాతిపిత" అని గౌరవిస్తారు. సత్యం, అహింస గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలు. కొల్లాయి కట్టి, చేత కర్రబట్టి అన్ని మతాలు, కులాలు ఒక్కటే అని చాటారు. 20 శతాబ్దంలో ప్రపంచంలో గొప్ప విజేత అయ్యాడు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సత్యాగ్రహం, అహింస అనే శక్తివంతమైన ఆయుధాలతో గడగడలాడించి కూకటివేళ్లతో పెకలించి, దేశానికి 1947 ఆగస్టు 15 న స్వతంత్రాన్ని కానుకగా ఇచ్చిన గొప్ప మహానుభావుడు గాంధీ.

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ రెండవ తేదీన గుజరాత్‌లోని పోరుబందర్‌లో జన్మించాడు. 1888లో న్యాయశాస్త్ర విద్యాభ్యాసానికి ఇంగ్లాండ్ వెళ్లారు. 1893లో దక్షిణాఫ్రికాలో ఒక న్యాయవాద కంపెనీలో కాంట్రాక్టు లభించింది.

జాతీ వివక్షకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమానికి అక్కడే శ్రీకారం చుట్టారు. సత్యగ్రహ పద్ధతిని అనుసరించడం అప్పుడే మొదలుపెట్టారు. అంటరానితనం, కులవివక్షత, మత విద్వేషాలను గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. 1914లో గాంధీజీ భారతదేశాన్ని తిరిగి వచ్చి భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో చురుకుగా పాల్గొనసాగాడు.

1917లో బీహార్‌లోని చంపారాన్ జిల్లాలో నీలిమందు రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి చంపారాన్ ఉద్యమాన్ని నడిపాడు. 1918లో చంపారాన్‌లో సత్యాగ్రహం నిర్వహించాడు. ఈ కాలంలోనే గాంధీజీని ప్రజలు ప్రేమతో "బాపు" అని, 'మహాత్ముడు" అని గౌరవంగా పిలవసాగారు. భారత జాతీయ కాంగ్రెసకు తిరుగులేని నాయకుడు అయ్యాడు. ఆయన రాకతో ఈ కాలంలో సాధారణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారింది. గాంధీ నాయకత్వంలో దేశమంతటా మూడు అతిపెద్ద, గొప్ప జాతీయ ప్రజా ఉద్యమాలు-సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం లేదా దండియాత్ర, క్విట్ ఇండియా ఉద్యమం జరిగాయి.

బ్రిటిష్ వారు భారతదేశాన్ని వదిలిపోవాలని డిమాండ్ చేస్తూ 1942లో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైంది. డూ ఆర్ డై నినాదం ద్వారా గాంధీజీ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాడు. 1942 ఆగస్టు 9న గాంధీజీని బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టుచేసి జైలుకు పంపింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇతర నాయకులను, లక్షమంది పైగా ఉద్యమకారులను బ్రిటిష్ వారు విడుదల చేశారు. క్రమక్రమంగా స్వాతంత్ర్యం ఇస్తామని అంగీకరించారు. హిందూ-ముస్లిం మత విద్వేషాలను అదుపు చేయలేని నిస్సహాయస్థితిలో ప్రభుత్వం ఉంది. చివరికి 1947 ఆగస్టు 15న బ్రిటీషువారు భారత్‌కు స్వాతంత్ర్యం ఇచ్చారు. లండన్‌లో చదువుకునే సమయంలో నిజాయితీ, నిగ్రహం పవిత్రత, శాకహారం అలవర్చుకున్నాడు. జైనమత ఆలోచనలైన కరుణ, శాకాహారం, ఉపవాసం, స్వీయ క్రమశిక్షణ ప్రభావం గాంధీజీపై తీవ్రంగా పడింది.

మహాత్మా గాంధీ తన జీవితాన్ని సత్యశోధనకు అంకితం చేశాడు. గాంధీజీ ఆత్మకథ పేరు సత్యశోధన, ఇంగ్లీషులో ద స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్. గాంధీజీ మొదట "దేవుడు సత్యంగా" పేర్కొన్నప్పటికీ తర్వాత "సత్యమే దేవుడు" తన తత్వంగా పేర్కొన్నాడు. అహింసను కనిపెట్టింది గాంధీ కాదు కానీ, అహింసను భారీ స్థాయిలో రాజకీయాల్లో ఉపయోగించిన వ్యక్తి గాంధీజీ. అహింసా సిద్ధాంతాన్ని బౌద్ధ, జైన, హిందూ, క్రైస్తవ మతాలలో అనేకసార్లు పేర్కొన్నాడు. అంటరానితనం నేరం, శాపం, పాపం, అమానుషం, అపచారం, అనాగరికం అని ఎంతోమంది మేధావుల పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలనకు గాంధీ ఎంతో కృషి చేశారు. హిందూ-ముస్లిం ఐక్యత కోసం గాంధీజీ ఎంతగానో కృషి చేశారు. గ్రామాలలో కుటీర పరిశ్రమల స్థాపనకు బాగా ప్రాధాన్యతనిచ్చారు. మానవ అవసరాలు తీరటానికి కుటీర పరిశ్రమలు స్థాపించాలన్నాడు. సర్వోదయ ఉద్యమాన్ని ప్రారంభించాడు. విద్యా విధానాన్ని కూడా మార్చి పిల్లల నైపుణ్యాన్ని పెంచే విధంగా విద్యావిధానం ఉండాలన్నారు. ఆయన విలువలు, సిద్ధాంతాలు నాటికి నేటికి ఏనాటికి, సూర్యచంద్రులు ఉన్నంతవరకు మనకు ఆదర్శ ప్రాయమైనవి, స్ఫూర్తిదాయకమైనవి, ఆచరణాత్మకమైనవి, మార్గదర్శకమైనవి. శిరోధార్యమైనవే !

కనుమరుగౌతున్న కరచాలనాలు

ఐ-మెయిల్


వి. శంకరయ్య

కరచాలనం అంటే 'షేక్ హ్యాండ్' నాకు ఇష్టమైన పలకరింపు విధానం. నమస్కారం పెట్టడంలో భక్తి, గౌరవం ఉండగా, కరచాలనంలో దగ్గరతనం, స్నేహం ఉంటాయి. ఈ పురాతన ప్రక్రియ అన్ని దేశాల్లో ఉంది. జపాన్‌లో ఉందో లేదో డౌటు. వాళ్లయితే వంగి పలకరించుకుంటారు. క్రీస్తుపూర్వం ఐదో శతాబ్దం తాలూకు చిత్రాల్లో కూడా కరచాలనం చేస్తున్న బొమ్మలు కనబడతాయి. వ్యాపార వ్యవహారాల్లో, క్రీడల్లో, వివిధ అధికారిక, అనధికారిక కార్యక్రమాల్లో, కలిసినప్పుడో, విడిపోయేటప్పుడో, సంధి కుదిరినపుడో, పరిచయం అవుతూనో షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడం కనబడుతూ ఉంటుంది. అయితే గమనిస్తే ఈ మధ్య అది రొటీన్‌గా ఉండడం తగ్గినట్లు తెలుస్తోంది. బహుశా కరోనా తర్వాత ఆ అలవాటు పబ్లిక్‌లో తగ్గిపోతున్నట్టు అనిపిస్తోంది. ఆరోగ్యరీత్యా కరచాలనం బదులు నమస్కారంతో సరిపెట్టడం మంచిదే కావచ్చు. జలుబు, కళ్లకలక, కరోనాలాంటి సాంక్రమిక వ్యాధుల్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు కానీ ఇద్దరు కలవడం, కరచాలనం చేసుకోవడంలోని ఆ 'ఫీల్' మాత్రం రాదు. టెన్నిస్‌లో గెలిచిన నాదల్‌ని, ఓడిపోయిన ఫెదరర్ షేక్ హ్యాండ్ ఇవ్వడం చూస్తే ఎంత బాగుంటుంది! అలాగే అమెరికా అధ్యక్ష పీఠంకోసం వాదులాడుకొనే ముందు ట్రంప్ దగ్గరకువెళ్లి ఆయన ప్రత్యర్థి హరిస్ కరచాలనం చెయ్యడం కూడా. ఎంత వంగి నమస్కారం పెట్టినా ఆ ఫీల్ వస్తుందా?

ఇవన్నీ ఎందుకు చెప్పడం అంటే నాకు, మీ అందరిలాగే, చిన్నప్పటి నుంచీ కరచాలనం అలవాటు. మిత్రులెటూ సరి. పరిచితులైనా, అపరిచితులైనా కలిసినప్పుడు చెయ్యి ముందుకు పోతుంది. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు కొన్ని వేల షేక్ హ్యాండులు తప్పవు. కారు కదిలిపోతున్నా, ముందుకు నడిచిపోతున్నా పరిగెత్తుకు వచ్చి కరచాలనం చేస్తుంటారు. క్షణమే అయినా అదో తృప్తి. మనం పెద్దవాళ్ల దగ్గర నుండి అందుకున్నపుడు ఆ ఫీల్ వెంటనే పోదు. ప్రముఖుల కరస్పర్శ, ఆ జ్ఞాపకం, సందర్భంతో సహా పదికాలాలపాటు మనసులో పదిలంగా ఉండిపోతుంది. నాకైతే వాజ్‌పేయి, కలాం, కె ఆర్ నారాయణ్‌లని తలుచుకున్నప్పుడు వారిచ్చిన షేక్‌హ్యాండు తాజాగా ఫీల్ అవుతాను. అందుకనే పబ్లిక్ లైఫ్‌లో షేక్‌హ్యాండు సంస్కృతి తగ్గకూడదని నా భావన. (నాకు షేక్ హ్యాండు ఇచ్చిన అత్యంత పవర్‌ఫుల్ వ్యక్తి ఎవరో తెలుసా! వ్లాదిమిర్ పుతిన్. నేను ఎంపీగా ఉండగా ఆయనోసారి, క్లింటన్ ఓసారి పార్లమెంట్ విజిట్ చేశారు. క్లింటన్ ఇప్పుడు మాజీ కదా!)

విశ్రాంత పాత్రికేయులు

6న కేజ్రీవాల్ 'జనతా కా అదాలత్'

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జనతా కా అదాలత్‌ను మరోసారి నిర్వహించనున్నారు. అక్టోబర్ 6వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఛత్రశాల్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఆయన చేపట్టనున్నారు. సెప్టెంబర్ 22వ తేదీన ఇదే కార్యక్రమాన్ని అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రజలతో నేరుగా ప్రభుత్వం సంబంధాలు కలిగి ఉండేలా ఈ జనతా కా అదాలత్ కార్యక్రమాన్ని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెరపైకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం వేదికగా ప్రజలు.. తమ సమస్యలను ప్రభుత్వంలోని మంత్రులతోపాటు ఉన్నతాధికారులతో నేరుగా విన్నవించుకోవచ్చు. ప్రజలు, ప్రభుత్వం మధ్య దూరాన్ని తగ్గించుకొనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లోనే అంటే.. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతోనే నిర్వహించాలని అరవింద్ కేజ్రీవాల్ కేంద్రాన్ని డిమాండ్ చేసిన సంగతి విదితమే. కానీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే నిర్వహిస్తామని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది.

బాలీవుడ్ నటుడు గోవిందాకు బుల్లెట్ గాయం

ముంబై: బాలీవుడ్ నటుడు, శివసేన నేత గోవిందాకు బుల్లెట్ గాయం అయింది. ఏం జరిగిందంటే... 'తెల్లవారు జామున 4.45 గంటల సమయంలో గోవిందా ఇంటి నుంచి కాల్పుల శబ్దం వినిపించింది. ఆ సమయంలో గోవిందా, పని మనిషి ఇద్దరూ ఉన్నారు. గోవిందా భార్య కోల్ కతాలో ఉన్నారు. కోల్ కతాలో షో ఉండటంతో ఉదయం 6 గంటలకు గోవిందా కూడా వెళ్లాల్సి ఉంది. ఎయిర్ పోర్టుకు బయల్దేరే ముందు లైసెన్స్‌డ్ రివాల్వర్ తీశారు. కప్ బోర్డు నుంచి గన్ తీసే సమయంలో అది కిందపడింది. ఆ తుపాకీ మిస్ ఫైర్ అయ్యి కాలికి బుల్లెట్ గాయం అయింది. అంధేరీలో గల క్రిటిక్ కేర్ ఆస్పత్రికి ఇంట్లో పనిచేసే సిబ్బంది తరలించారు' అని పోలీసులు తెలిపారు. గోవిందా ఇంట్లో కాల్పుల విషయం తెలిసి వెంటనే ఆస్పత్రికి పోలీసులు చేరుకున్నారు. ఏం జరిగిందని ఆరా తీశారు. గోవిందాను కలిసేందుకు ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్ దయా నాయక్ కూడా వచ్చారు. 'కోల్ కతాలో షో కోసం వెళ్లాల్సి ఉంది. ఉదయం 6 గంటలకు నేను ఎయిర్ పోర్టు చేరుకున్నాను. గోవిందా ఇంటి నుంచి బయల్దేరే ముందు ప్రమాదం జరిగింది. రివాల్వర్ అల్మారాలో ఉంచగా మిస్ ఫైర్ అయింది. ఆ తుపాకీ కింద పడి కాలికి బుల్లెట్ గాయం అయ్యింది. ఆ భగవతుండి దయ వల్ల గోవిందా కాలికి మాత్రమే గాయమయింది ' గోవిందా మేనేజర్ శశి సిన్హా మీడియాకు తెలిపారు.

మహిళల్ని ఎందుకు సన్యాసినులుగా మారుస్తున్నారు?: మద్రాస్ హైకోర్టు

చెన్నై: తమ కుమార్తెల బుర్ర తినేసి... వాళ్లు ఈషా యోగా సెంటర్‌లోనే ఉండేటట్లు చేశారంటూ సద్గురు జగ్గీ వాసుదేవ్‌పై ఓ ప్రొఫెసర్ కేసు దాఖలు చేశారు. ఆడపిల్లలను సన్యాసినులుగా మార్చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జగ్గీ వాసుదేవ్‌ను మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. మహిళలను ఎందుకు సన్యాసినులుగా మారేలా ప్రేరేపిస్తున్నారని హైకోర్టు అడిగింది. తన స్వంత కూతురి పెళ్లి చేసిన సద్గురు... ఎందుకు ఇతర అమ్మాయిలను సన్యాసం వైపు మళ్లిస్తున్నారని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియం, వీ శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం ఈ ప్రశ్నలు వేసింది. తన ఇద్దరు కుమార్తెలను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లు శాశ్వతంగా ఈషా యోగా సెంటర్‌లోనే ఉంటున్నారని కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు మహిళలు ఆ కేసులో మంగళవారం కోర్టు ముందు హాజరయ్యారు. అయితే తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని చెప్పారు. కుమార్తెలు వదిలి వెళ్లడం వల్ల తమ జీవితం దుర్భరమైనట్లు ఆ తల్లిదండ్రులు కోర్టుకు వెల్లడించారు. అయితే ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని జడ్జీ సూచించారు. ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని కేసులను లిస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. తన కుమార్తెకు పెళ్లి చేసి, జీవితంలో సెటిలయ్యేలా చేశారని, కానీ ఇతరుల కుమార్తెలను మాత్రం సన్యాసుల్లా జీవించేలా ప్రేరేపిస్తున్న సద్గురు ఎందుకు అలా చేస్తున్నారో తెలుసుకోవాలని ఉందని జస్టిస్ శివజ్ఞానం తెలిపారు. అయితే స్వచ్ఛందంగా ఉండేందుకు మహిళలు నిర్ణయించినట్లు ఈషా ఫౌండేషన్ తెలిపింది.

మళ్లీ బెంగాల్ వైద్యుల సమ్మెబాట

- మరో డాక్టర్‌పై దాడి జరగడంతో మమత ప్రభుత్వంపై మండిపాటు
- విధుల బహిష్కరణ... అత్యవసర సేవలూ బంద్
- నేడు భారీ ర్యాలీకి పిలుపు

కోల్‌కతా: ఆర్జీకర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటన తర్వాత ఆందోళన చేపట్టిన జూనియర్ డాక్టర్లు వారం క్రితం తాత్కాలికంగా నిరసన విరమించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హామీతో నిరసన విరమించిన వైద్యులు.. తాజాగా మళ్లీ ఆందోళన బాట పట్టారు. మంగళవారం నుంచే విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రులలో తమకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సాగోర్ దత్తా మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో ఓ వైద్యుడిపై దాడి జరగడంతో ఆందోళన చేపట్టారు. ఈసారి ఆందోళనను మరింత తీవ్రంగా చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అత్యవసర సేవలు సహా అన్ని సేవలకు దూరంగా ఉండనున్నట్లు వెల్లడించారు. ఆర్జీ కర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం నేపథ్యంలో పనిచేసే చోట తమకు రక్షణ లేకుండా పోయిందని వైద్యులు వాపోతున్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు మహిళా వైద్యుల భద్రత, డాక్టర్లపై దాడులను అరికట్టేందుకు రక్షణ ఏర్పాట్ల కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టిన వైద్యులతో అప్పట్లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపారు. ఆసుపత్రులలో మహిళా వైద్యుల కోసం ప్రత్యేక టాయిలెట్లు, ఆసుపత్రులలో సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లు తదితర ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వైద్యులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు. అయితే, తాజాగా సాగోర్ దత్తా ఆసుపత్రిలో వైద్యుడిపై దాడి జరగడంతో మళ్లీ ఆందోళన చేపట్టారు. బుధవారం (అక్టోబర్ 2) భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు ప్రకటించారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వైద్యులు ఆరోపించారు. దీంతో విధులను బహిష్కరించడం మినహా తమకు మరో మార్గంలేకుండా పోయిందని చెప్పారు. 'మా భద్రతకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల వైఖరి కనిపించడం లేదు. సీఎం మమతా బెనర్జీ చర్చల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించాం' అని ఓ డాక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఇది పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. సెంట్రల్ కోల్‌కతాలోని స్వేర్ కళాశాల నుంచి ధర్మతల వరకు బుధవారం జూనియర్ వైద్యులు భారీ ర్యాలీకి పిలుపునిచ్చారు. తమతో పాటు పాల్గొనాలని ప్రజలను కోరారు. హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థికి న్యాయం చేయాలనేది వైద్య విద్యార్థుల ప్రధాన డిమాండ్. ఇక ఆరోగ్య కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను విధుల నుంచి తొలగించడం, రాష్ట్రంలో అన్ని వైద్య కళాశాలల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో పోలీసుల రక్షణను పెంచాలని, శాశ్వత మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలనేవి వారి డిమాండ్లు.

'లాపతా లేడీస్' పోస్టర్లతో కాంగ్రెస్ వినూత్న ఎన్నికల ప్రచారం

ముంబై: మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార పక్షం విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మహిళల అదృశ్యం అంశాన్ని లేవనెత్తుతూ 'లాపతా లేడీస్' పోస్టర్లతో కాంగ్రెస్ వినూత్న ప్రచారాన్ని ప్రారంభించింది. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ చిత్రాలు ప్రతిబింబించేలా రూపొందించిన ఫ్లెక్సీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసింది. ఏడాదిలో 64 వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని అందులో పేర్కొంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మహిళల అదృశ్యం ఘటనలపై గతంలో ఫడ్నవీస్ మాట్లాడుతూ... 'మహిళల భద్రత అత్యంత ఆందోళనకరం. మహారాష్ట్రలో ఏటా 64 వేల మంది బాలికలు, మహిళలు కనిపించకుండా పోతున్నారు. 2019, 2020లో ఆ సంఖ్య మారలేదు. 2021లో 61వేల కేసులు నమోదయ్యాయి. అందులో 87 శాతం మంది తిరిగివచ్చారు. 2022లో 86 శాతం మంది తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఈ సమస్యను కట్టడి చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం' అని తెలిపారు. ప్రస్తుతం బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్)లతో కూడిన మహాయుతి అధికారంలో ఉంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ... ఈ కూటమికి గట్టి పోటీ ఇచ్చింది. ఇదిలాఉంటే.. గతేడాది విడుదలైన హిందీ సినిమా 'లాపతా లేడీస్' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు వధువులు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారవుతారు. మరి ఆ తర్వాత వారి జీవితాలు ఎలా సాగాయి... వాళ్ల భర్తల దగ్గరికి ఎలా చేరుకున్నారు... అనేది ఇందులో చూపించారు. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమాను ఓవైపు ప్రేక్షకుల్ని నవ్విస్తూనే... మరోవైపు సమాజంలోని మహిళల గుర్తింపు గురించి ప్రశ్నలు లేవనెత్తేలా సందేశాత్మకంగా తీర్చిదిద్దారు. పితృస్వామ్య వ్యవస్థపై తీసిన వ్యంగ్య చిత్రమిది. ఈ చిత్రం 2025 ఆస్కార్ పురస్కారాలకు మనదేశం నుంచి అధికారికంగా ఎంపికైంది.

నాలుగు నెలల వయసులో పెళ్లి...
ఇరవై ఏళ్ల వయసులో రద్దు

జోధ్‌పూర్: యువతి పోరాటంతో న్యాయస్థానం బాల్య వివాహాన్ని రద్దు చేసిన ఘటన రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జోధ్‌పూర్‌కు చెందిన అనితకు వారి తల్లిదండ్రులు నాలుగు నెలల వయసులోనే వివాహం చేశారు. దీంతో యువతికి 15 ఏళ్లు వచ్చేసరికి కాపురానికి పంపాలని ఆమె అత్తమామలు కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. భర్తతో ఉండటానికి ఇష్టపడని అనిత బాల్య వివాహానికి వ్యతిరేకంగా న్యాయ పోరాటానికి దిగింది. తన సోదరి, సోదరుడి సహకారంతో బాల్య వివాహానికి వ్యతిరేకంగా పోరాడింది. చివరకు సారథి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కృతి భారతి సాయంతో బాల్య వివాహంపై పోరాడి గెలిచింది. జోధ్‌పూర్‌లోని కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి అనిత బాల్య వివాహన్ని రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

కోర్టు వ్యాజ్యం ఖర్చులను బాధిత యువతికి చెల్లించాలని అత్త,మామలను న్యాయస్థానం ఆదేశించింది. అనితకు నాలుగు నెలల వయసులోనే బాల్య వివాహం చేశారు. 15 ఏళ్ల వయసు వచ్చేసరికి భర్త ఇంటికి పంపించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఐదేళ్లుగా అనిత న్యాయ పోరాటం చేసింది. చివరకు ఆమెకు 20 ఏళ్ల వయసులో విజయం సాధించింది. కోర్టు అనితకు సానుకూలంగా తీర్పునిచ్చింది. ఓవైపు బాల్య వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నా.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. భవిష్యత్తులో బాల్యవివాహాల కట్టడికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

వర్ధమాన్ గ్రూప్ ఎండీకి రూ.7 కోట్ల టోకరా?
మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

న్యూఢిల్లీ: వర్ధమాన్ గ్రూప్ అధినేత ఎస్పీ ఓస్వాల్‌ను సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. ఆయన వద్ద నుంచి రూ.ఏడు కోట్లు లాగేశారు. సీజేఐ డీవై చంద్రచూడ్ గెటప్‌లో... ఓ వర్చువల్ ఫేక్ కోర్టురూమ్‌ను తయారు చేసి... ఎస్పీ ఓస్వాల్‌ను బెదిరించారు. టెక్స్‌టైల్ సంస్థ ఎండీ అయిన ఓస్వాల్.. ఆగస్టు 28, 29వ తేదీల్లో డిజిటల్ చోరీకి గురయ్యారు. వివిధ అకౌంట్లకు ఏడు కోట్లు బదిలీ చేసేలా ఆయన్ను ఒత్తిడి చేశారు. అయితే ఆ అకౌంట్లను స్తంభింపచేసి... వాటి నుంచి సుమారు ఐదు కోట్లు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేశారన్న విషయాన్ని ఆ వ్యాపారవేత్త వివరించారు. మనీ ల్యాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరిస్తూ... ఆ సైబర్ గ్యాంగ్ ఆయన వద్ద నుంచి ఏడు కోట్లు వసూలు చేశారు. మీ పేరుతో కెనరా బ్యాంక్ అకౌంట్ ఉందని, ఆ అకౌంట్ నుంచి ఆర్థిక అక్రమాలు జరిగాయని ఆ ముఠా బెదిరించింది. ఆ అకౌంట్‌కు నరేశ్‌గోయల్ కేసుతో లింకు ఉన్నట్లు మోసగాళ్లు బెదిరించారు. వీడియోకాల్ చేసి ఓ ఫేక్ కోర్టురూమ్‌ను సృష్టించారు. ఆ కోర్టు రూమ్‌లో సీజేఐ చంద్రచూడ్ తన కేసును విచారిస్తున్నట్లు ఫ్రాడ్‌స్టర్లు చూపించారని ఓస్వాల్ తెలిపారు. వాట్సాప్ ద్వారా సీజే ఇచ్చిన ఆదేశాలను పంపించారు. ఆ ఆదేశాల ప్రకారం ఓస్వాల్ వేర్వేరు అకౌంట్లలో ఏడు కోట్లు జమ చేశారు. నరేష్ గోయల్ కేసు నుంచి రక్షిస్తామని హామీ ఇస్తూ... ఫేక్ సుప్రీంకోర్టు ఆదేశాలు తనకు పంపినట్లు ఓస్వాల్ తెలిపారు. ఓస్వాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 31వ తేదీన కేసు నమోదు చేశారు.

కేంద్ర హెూంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైం సెంటర్ ద్వారా మూడు అకౌంట్లను సీజ్ చేశారు. వాటి నుంచి 5.25 కోట్లు రికవరీ చేశారు. ఈ నేరం వెనుక అంతరాష్ట్ర ముఠా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతాను చౌదరీ, ఆనంద్ కుమార్‌ను గుహవతిలో అరెస్టు చేశారు. ఆ ఇద్దరూ వ్యాపారులే. ఈ కేసులో మాస్టర్‌మైండ్, బ్యాంక్ ఉద్యోగి రూమి కాలిటా కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిమ్మి భట్టాచార్య, అలోక్ రంగి, గులామ్ ముర్తాజా, జాకిర్ కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. నరేశ్ గోయల్ కేసు నుంచి రక్షిస్తామని హామీ ఇస్తూ... ఫేక్ సుప్రీంకోర్టు ఆదేశాలు తనకు పంపినట్లు ఓస్వాల్ తెలిపారు. ఓస్వాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 31వ తేదీన కేసు నమోదు చేశారు. కేంద్ర హెూంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైం సెంటర్ ద్వారా మూడు అకౌంట్లను సీజ్ చేశారు. వాటి నుంచి 5.25 కోట్లు రికవరీ చేశారు. ఈ నేరం వెనుక అంతరాష్ట్ర గ్యాంగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతాను చౌదరీ, ఆనంద్ కుమార్‌ను గౌహతిలో అరెస్టు చేశారు. ఆ ఇద్దరూ వ్యాపారులే. ఈ కేసులో మాస్టర్‌మైండ్, బ్యాంక్ ఉద్యోగి రూమి కాలిటా కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిమ్మి భట్టాచార్య, అలోక్ రంగి, గులామ్ ముర్తాజా, జాకిర్ కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

దుష్యంత్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి

జింద్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హఠాత్పరిణామం చోటుచేసుకుంది. జింద్ జిల్లా ఉచన కలాన్‌లో జననాయక్ జనతా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దాడికి పాల్పడ్డారు. దుష్యంత్ చౌతాలా బహిరంగ సభలో మాట్లాడుతుండగా కొందరు అగంతకులు గలభా సృష్టించి కాన్వాయ్‌పై ఇటుకలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఒక వాహనం అద్దాలు పగిలిపోయాయి. దీంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. దుష్యంత్‌తో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ నేత, ఎంపీ చంద్రశేఖర్ కూడా ఉచానాలో జరిగిన రోడ్‌షో పాల్గొన్నారు. ఉచానా అసెంబ్లీ నియోజకవర్గంని చౌతాలా పోటీ చేస్తున్నారు. చౌతాలా 2019లో ఇక్కడి నుంచి గెలిచారు. 2014లో బీజేపీ అభ్యర్థి ప్రేమ్‌లత చేతిలో ఓడిపోయారు. ఈసారి చౌతాలాపై బీజేపీ అభ్యర్థి చతర్భుజ్ అట్టారి (బీజేపీ), బ్రిజేంద్ర సింగ్ (కాంగ్రెస్) పోటీ చేస్తున్నారు. కాగా జింద్‌లో తన కాన్వాయ్‌పై దాడి ఘటనపై దుష్యంత్ చౌతాలా స్పందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు. దాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్ అంతా వారి దగ్గర ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్‌కు తప్పనిసరిగా లేఖ రాస్తామని చెప్పారు. ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి, గత రెండు ఎన్నికల్లోనూ తనపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు.

విరిగిన పట్టాలపై దూసుకెళ్లిన రైలు.. తప్పిన భారీ ప్రమాదం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో కేరళ ఎక్స్‌ప్రెస్ విరిగిన పట్టాలపైకి దూసుకువెళ్లింది. అయితే తృటిలో భారీ ప్రమాదం తప్పింది. తిరువనంతపురం నుంచి న్యూఢిల్లీకి వెళ్తుండగా ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే వర్గాల సమాచారం ప్రకారం, లలిత్‌పూర్ స్థానిక రైల్వే యంత్రాంగం పొరపాటు కారణంగా దెబ్బతిన్న ట్రాక్‌పైకి రైలు వెళ్లింది. పట్టాలపై సిబ్బంది పనులు చేస్తుండగా రైలు రావడంతో వెంటనే వారు ఎర్రజెండా ఊపారు. ఆ సమయానికి లోక్ పైలెట్ ఎమెర్జెన్సీ బ్రేకులు వేయడంతో అప్పటికే మూడు బోగీలు దెబ్బతిన్న ట్రాక్‌పైకి చేరుకున్నాయి. అయితే ప్రయాణికులు ఎవరూ గాయపడకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. రైలు ఝాన్సీ చేరిన వెంటనే ప్రయాణికులు రైలు దిగి అధికారులను అప్రమత్తం చేశారు.

పెరుగుతున్న ఘటనలు

రైళ్లను పట్టాలు తప్పించేందుకు, ప్రమాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు అనుమానించే పలు ఘటనలు కొద్ది వారాలుగా చోటుచేసుకుంటున్నాయి. సెప్టెంబర్ 28న బాందా-మహెూబా రైల్వే ట్రాక్‌పై విరిగిన స్తంభం ఒకటి కనిపించడంతో విజిలెంట్ లోకో పైలెట్ సకాలంలో ఎమర్జెన్సీ బ్రేకులు వేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. అదే రోజు యూపీలోని బల్లియాలో రైల్వే ట్రాక్‌పై కొందరు దుండగులు పెద్ద బండరాయిని ఉంచారు. లోకోపైలెట్ బ్రేక్స్ వేసినప్పటికీ రాయిని ఇంజన్ తాకింది. దీనికి ముందు, సెప్టెంబర్ 22న యూపీలోని కాన్పూర్ దెహత్ జిల్లాలోని రైల్వే ట్రాక్‌పై ఒక గ్యాస్ సిలెండర్‌ను కనుగొన్నారు. లోకో పైలట్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది.

రజనీకాంత్‌కు అస్వస్థత

చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ (73) మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీకాంత్‌కు శస్త్రచికిత్స పూర్తయినట్లు తెలుస్తోంది. వైద్యులు ఉదయం ఆయన పొత్తికడుపులో స్టెంట్ వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. మరో మూడు రోజుల్లో ఆసుపత్రి నుంచి విడుదల అవుతారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రజనీ ఆరోగ్యంపై ఆయన భార్య లత స్పందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. రజనీకాంత్ ఆసుపత్రిలో చేరినట్లు వార్తలు రావడంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఆయన క్షేమంగా ఉన్నారని తెలియడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ 'వేట్టయాన్', 'కూలీ' సినిమాల్లో నటిస్తున్నారు. 'వేట్టయాన్' ఈ నెల 10న విడుదల కానుంది. ఇటీవల జరిగిన ఈ సినిమా ఆడియో రిలీజ్ వేడుకలోనూ రజనీ పాల్గొన్నారు. అనిరుధ్‌తో కలిసి డ్యాన్స్ వేశారు.

నా స్నేహితుడు త్వరగా కోలుకోవాలి: స్టాలిన్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజనీకాంత్ ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందించారు. 'ఆసుపత్రిలో చేరిన నా స్నేహితుడు రజనీకాంత్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి కూడా నటుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సర్పంచ్ పదవికి రూ.2 కోట్లు...
పంజాబ్‌లో వేలంలో ఎన్నిక

చండీగఢ్: పంజాబ్‌లో మరికొన్ని రోజుల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్న క్రమంలో ఇప్పటికే కొన్ని స్థానాలు ఏకగ్రీవమైనట్లు ప్రకటనలు వచ్చాయి. అయితే, పోలింగ్ ప్రక్రియతో సంబంధం లేకుండా ఓ గ్రామంలో సర్పంచ్‌ని వేలం పాటలో ఎన్నుకుంటుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ పదవి ఏకంగా రూ.రెండు కోట్లు పలకడం చర్చనీయాంశమైంది. గురుదాస్‌పూర్‌లోని హర్దోవల్ కలన్ గ్రామంలో సర్పంచ్ పదవికి వేలంపాట నిర్వహించారు. రూ.50 లక్షలతో వేలం మొదలైంది. స్థానిక బీజేపీ నేత ఆత్మాసింగ్ ఏకంగా రూ.2 కోట్లకు పాడారు. గ్రామానికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తారో వారినే సర్పంచ్‌గా ఎన్నుకుంటారని అతడు చెబుతున్నాడు. సోమవారంతో వేలం పాట గడువు ముగిసింది. ఇప్పటివరకు ఆత్మాసింగ్ మాత్రమే అత్యధిక బిడ్డింగ్ వేయడంతో ఆయననే సర్పంచ్‌గా ఏకగ్రీవం చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ 'వేలం పాట' ఎన్నికపై రాజకీయంగా తీవ్ర దుమారం మొదలైంది. 'ఇది బహిరంగ అవినీతి. ఇలాంటి ఎన్నిక అధికారికం కాదు. దీనిపై దర్యాప్తు చేసి బాధ్యులను జైలుకు పంపాలి' అని కాంగ్రెస్ నేత ఒకరు డిమాండ్ చేశారు. ఇది వివాదాస్పదం కావడంతో దీనిపై దర్యాప్తునకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరోవైపు, సర్పంచ్ ఎన్నికకు ఆత్మాసింగ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం. అయితే, పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి పదవికి ఇలా వేలంపాట నిర్వహించడం ఇదే తొలిసారి కాదట. ఇటీవల బఠిండాలోని గెహ్రి బత్తార్ గ్రామంలోనూ వేలం నిర్వహించగా... అత్యధికంగా రూ.60 లక్షలు పలికినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విజేతపై అక్కడ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. పంజాబ్ వ్యాప్తంగా 13,237 సర్పంచ్ స్థానాలకు ఈ నెల 15న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు నాల్గో తేదీ తుది గడువు. పోలింగ్ ముగిసిన తర్వాతే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

జెండాపై ఏనుగు బొమ్మకు అభ్యంతరం లేదు
విజయ్ పార్టీకి ఈసీ ఊరట

చెన్నై: ప్రముఖ సినీ నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రికళగం (టీవీకే) పతాకంలో ఏనుగు బొమ్మలకు తామెలాంటి అభ్యంతరాలు తెలుపలేమంటూ కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు బీఎస్పీ అధిష్టానానికి లేఖ రాసింది. ఆగస్టు 22న విజయ్ పార్టీ పతాకాన్ని పరిచయం చేశారు. ఆ జెండా మధ్యలో రెండు ఏనుగుల బొమ్మలు ఉండటంతో ఏనుగు తమ పార్టీ చిహ్నమంటూ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) పేర్కొంది. అంతటితో ఆగకుండా విజయ్ పార్టీ పతాకంలో ఏనుగుల బొమ్మలను తొలగించేలా ఆదేశించాలని బీఎస్పీ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు బీఎస్పీకి ప్రత్యుత్తరం ఇచ్చారు. అందులో రాజకీయ పార్టీల జెండాల్లో ఉండే చిహ్నాలు, రూపాలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి ఆదేశాలు ఇవ్వదని, జెండాలోని చిహ్నాలకు తమ సంఘం నిబంధనలు వర్తించవని స్పష్టం చేసింది.

కాంగ్రెస్‌తో దేశ ఐక్యతకు విఘాతం: మోదీ



పల్వల్: కులమతాల మధ్య చిచ్చు పెడుతూ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాన నరేంద్ర మోదీ ఆరోపించారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్వల్‌లో మంగళవారం జరిగిన ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. కుల రాజకీయాలు, అవినీతి, రిజర్వేషన్లతో సహా వివిధ అంశాలపై కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 'ఒక సామాన్య కార్యకర్తగా చాలాకాలంగా హర్యానా రాజకీయాలను ఆమూలాగ్రంగా నేను గమనించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకునే అవకాశం ఇటీవల నాకు కలిగింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఇదే నా చివరి ర్యాలీ. అయితే ఇది ఒక ప్రత్యేకమైన ర్యాలీగా ఎప్పటికీ గుర్తుండిపోయేలా మీరు చేశారు' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రామమందిర నిర్మాణానికి అడ్డుపడిందని, జమ్మూకశ్మీర్‌లో సంపూర్ణంగా రాజ్యాంగాన్ని అమలు కానీయలేదని, అసెంబ్లీల్లో, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ పాటించలేదని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించ లేదని, కేవలం సొంత కుటుంబం కోసమే పనిచేసిందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నో పాపాలు చేసినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే కలలు కంటోందని అన్నారు. కులతత్వాన్ని ప్రచారం చేస్తూ దేశభక్తిని అణగదొక్కాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. దేశభక్తుల ఐక్యతను దెబ్బతీయాలను కుంటోందని ఆరోపించారు. హర్యానా ప్రజలు సమైక్యంగా నిలిచి అభివృద్ధికే ఓటు వేయాలని కోరారు. దేశాన్ని ప్రేమించే వారంతా ఐక్యంగా ఉంటామని హర్యానా ప్రజలు ప్రతిన పూనాలంటూ మోదీ పిలుపునిచ్చారు.

దేరాబాబాకు మళ్లీ పెరోల్!

చండీగఢ్: ఇద్దరు మహిళా భక్తులపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న దేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి జైలు నుంచి బయటకు వస్తున్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన పెరోల్‌పై బయటకు వస్తుండడం విశేషంగా మారింది. పెరోల్ కోరుతూ ఆయన చేసుకున్న విజ్ఞప్తిని భారత ఎన్నికల కమిషన్ సోమవారం ఆమోదించింది. గత తొమ్మిది నెలల్లో ఆయన పెరోల్‌పై జైలు బయటకు రానుండటం ఇది మూడవసారి. కాగా నాలుగేళ్ల క్రితం దోషిగా తేలిన తర్వాత పెరోల్ పొందడం పదిహేనవది. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, గతంలోని మున్సిపల్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్‌పై దేరాబాబా విడుదలైన సందర్భాలున్నాయి.

ప్రైవేటీకరణ దుర్మార్గం

- విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు
- సీఎం చంద్రబాబు వైఖరేంటో స్పష్టం చేయాలి
- లేకుంటే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తాం
- యువజన, విద్యార్థి సంఘాల నేతల హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్వర్యాన మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన నిరసన దీక్ష లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శివారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్ హాజరై సంఘీభావం తెలియజేశారు. సుదీర్ఘ పోరాటాలు, అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం దుర్మార్గమని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నేతలు ఈసందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో చరిత్రాత్మక పోరాటానికి, ఎటువంటి త్యాగాలకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. లాభాలు వస్తున్న పరిశ్రమను కావాలని నష్టాల్లోకి నెట్టి, దానిని బూచిగా చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు విశ్వయత్నం చేస్తుందని వారు మండిపడ్డారు. ప్రభుత్వం అధ్వర్యంలోని పరిశ్రమకు అవసరమైన గనులు కేటాయించకపోవడమే, కుట్రకోణం తేటతెల్లమవుతోందన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మంది ఉపాధికి దోహదపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపధ్యంలో ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, దీనిపై సీఎం చంద్రబాబు తన వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమ తెలుగు ప్రజల బలిదానాలతో ఏర్పడిందని, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేడు ఎన్నికల ముగిసిన తర్వాత పట్టువిడుపులు ఉండాలంటూ ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కేంద్రంపై ప్రైవేటీకరణ యోచన విరమించుకునేలా ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేపట్టడంతోపాటు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాడిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలు ఐక్యపోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కర్నూలులో ధర్నా చౌక్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాపిర్ బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షత వహించగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నక్కీ లెనిన్‌బాబు దీక్షా శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుల్లాయిస్వామి అధ్యక్షతన జరిగిన దీక్షా శిబిరాన్ని విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి కన్వీనర్ రాజారెడ్డి ప్రారంభించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు వేమన, వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. ఒంగోలులో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్, అమలాపురంలో రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద మూడు రోజుల దీక్షను ప్రారంభించగా, తొలిరోజు నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు సంఘీభావాన్ని తెలియజేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో నిర్వహించిన దీక్షల్లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, జిల్లా కన్వీనర్ సాధిక్‌బాబు పాల్గొన్నారు. విద్యార్థి, యువజన సమాఖ్యల రాష్ట్ర నేతలు జి నాగరాముడు నంద్యాలలో, సంతోష్ కుమార్ అనంతపురంలో, కత్తి రవి తిరుపతిలో, వై బాబి కాకినాడలో, మొజ్జాడ యుగంధర్ శ్రీకాకుళం నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగిన దీక్షలో సీపీఐ జిల్లాకార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐఎస్ఎఫ్, వైఎఫ్‌జిల్లా కన్వీనర్లు శివకుమార్, రాజులు పాల్గొన్నారు. భీమవరంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెఎన్‌వీ గోపాలన్ ప్రసంగించారు. తణుకులో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు చర్యలు

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం లేఖ రాశారు. 10 సంవత్సరాలుగా అనేక మంది జీవిత ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి శిక్షను అనుభవించిన ఖైదీలు క్షమాభిక్ష కోసం, ఖైదీల విడుదల కోసం వారి కుటుంబీకులు ఎదురుచూస్తూ ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో తమరు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1995 నుంచి 2019 వరకు వివిధ జీవోలను విడుదల చేసి ఆయా సంవత్సరాల్లో ఏడు సంవత్సరాల వాస్తవ శిక్ష, 3 సంవత్సరాల రిమిషన్‌తో కలిపి పదేళ్లు పూర్తయిన ఖైదీలందరికీ సామూహిక క్షమాభిక్ష ద్వారా విముక్తి ప్రసాదించారని, ఫలితంగా కొన్ని వందల ఖైదీల కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వం ప్రసాదించిన క్షమాభిక్ష వందలమంది ఖైదీలను నిరాశ పరిచిందన్నారు. అనేక నిబంధనలు పెట్టి సామూహిక క్షమాభిక్ష పెట్టడం ద్వారా వందలాది ఖైదీలు విడుదలకు నోచుకోలేదన్నారు. దీంతో ఖైదీలు, వారి కుటుంబీకుల ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించిందని తెలిపారు. 2024 అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఏడు సంవత్సరాల వాస్తవ శిక్షా కాలం, 3 సంవత్సరాల రెమిషన్ కలిపి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పురుష ఖైదీలకు, 5 సంవత్సరాలు వాస్తవ శిక్షా కాలం, 2 సంవత్సరాల రెమిషన్ కలిపి ఏడేళ్ల శిక్షాకాలం పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు సామూహిక క్షమాభిక్ష ప్రసాదించి, విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రేపటి నుంచి టెట్ పరీక్షలు

రోజుకు రెండు సెషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష(ఏపీ టెట్)-2024కు వేళైంది. ఈనెల 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పేపర్-1, పేపర్-2 పరీక్షలను రోజు నిర్వహిస్తారు. సెషన్-1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెషన్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుంది. 3వ తేదీన రెండు సెషన్లలో లాంగ్వేజీ పేపర్లు ఉంటాయి. ఉదయం పేపర్-2(ఏ)లో కన్నడం, తమిళం, ఒరియా, ఉర్దూ, సంస్కృతం, మధ్యాహ్నం తెలుగు సాహిత్యం పేపర్లు ఉంటాయి. 11, 12 తేదీల్లో సెలవులు రాగా ఆ తర్వాత నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఈసారి టెట్ పరీక్షలకు దరఖాస్తులు పోటెత్తాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పేపర్-1(ఏ) భాగంగా 1,82,809 మంది పరీక్ష రాయనున్నారు. మ్యాథ్స్, సైన్స్ విభాగంలో 1,04,788 మంది, సోషల్ స్టడీస్‌లో 70,767మంది, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-1(బి)కి 2,062 మంది, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పేపర్-2(బి)కి 2,438 మంది దరఖాస్తు చేసుకున్నారు. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో దరఖాస్తులు పోటెత్తాయి. తొలుత జులై 2న నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించి కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. డీఎస్సీలో 20శాతం వెయిటేజీ ఉండటంతో టెట్ పరీక్షకుకు ప్రాధాన్యత ఏర్పడింది. అభ్యర్థులు చాలా మంది ఇప్పటికే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. అభ్యర్థుల కోసం 93988 10958, 81219 47387 హెల్ప్‌లైన్ నంబర్లను విద్యాశాఖ ఏర్పాటు చేసింది.

గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డికి కస్టడీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గనులశాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిని మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలిచ్చింది. వైసీపీ హయాంలో గనుల శాఖలో అక్రమాలు జరిగాయన్న అభియోగంపై వెంకటరెడ్డిని ఏసీబీ గతనెల 26న హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా వెంకటరెడ్డిని రిమాండ్‌కు తరలించారు. ఆయనను విచారించేలా ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి మూడురోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం జీవో జారీ చేసింది. పట్టా భూములతో పాటు, డీకేటీ పట్టా భూముల్లోనూ ఇసుక తవ్వకాలకు సంబంధించిన మార్గదర్శకాలతో ఉత్తర్వులను గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా జీవో జారీ చేశారు.

రేపు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 3వ తేదీన జరుగుతుందని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవధి సుబ్బారావు, కార్య నిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ హను మాన్‌పేటలోని దాసరి నాగభూషణరావు భవన్ నందు గురువారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా మాజీ ఎమ్మెల్సీ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవా ధ్యక్షులు జల్లి విల్సన్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం చర్చించి... కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అతి ధనవంతుల ప్రయోజనకారి మోదీ : రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. అతి ధనవంతులకు అసమానంగా ప్రయోజనం చేకూర్చే వ్యవస్థను సృష్టించారని ఆరోపించారు. హర్యానాలోని బహదూర్‌ఘర్‌లో మంగళవారం ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, బిలియనీర్ల విలాసవంతమైన జీవనశైలి, సగటు రైతు జీవన పోరాటం మధ్య వ్యత్యాసం... ఆర్థిక అసమానతలు, దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పునాదులను ఎలా దెబ్బతీస్తుందో ఎత్తిచూపారు. 'అంబానీ పెళ్లి చూశారా... అంబానీ పెళ్లికి కోట్లు ఖర్చు పెట్టారు. అది ఎవరి సొమ్ము?... మీ డబ్బు. మీరు మీ పిల్లలకు పెళ్లి చేసేందుకు బ్యాంకు రుణాలు తీసుకుంటారు. కానీ నరేంద్ర మోదీ జీ అలాంటి నిర్మాణం చేశారు. దీనికింద ఎంపిక చేసిన 25 మంది పెళ్లిళ్లకు కోట్లు ఖర్చు చేయవచ్చు. ఉన్నత వర్గాలు హద్దులు లేకుండా చలామణి చేయగలిగినప్పటికీ, సాధారణ పౌరులు, ముఖ్యంగా రైతులు మాత్రం తమ పిల్లలకు పెళ్లి చేయడం కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు' అని తెలిపారు. ప్రధాని మోదీ... అదానీ, అంబానీకి సహాయం చేస్తున్నారని, దేశంలోని ఉపాధి వ్యవస్థను నాశనం చేశారని, ఆపై వారంతా కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తారని విమర్శించారు. 'ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులు దేశంలోని సంస్థల్లో తమ సొంత వ్యక్తులను నింపినప్పుడు, దళితులు, వెనుకబడిన తరగతులకు చోటు లభించనప్పుడు వారు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తోంది. మేము దానిని రక్షించడానికి ప్రయత్నిస్తాం. ప్రధాని మోదీ కోటీశ్వరుల రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి రైతులు, విద్యార్థుల రుణాలను మాఫీ చేయకపోవడం ద్వారా రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు' అని రాయ్‌బరేలీ ఎంపీ విమర్శించారు. గాంధీ తన ప్రసంగంలో పెరుగుతున్న అసమానతలపై ఆందోళనలను లేవనెత్తారు. రైతు కష్టాలు, ప్రస్తుత పరిపాలనలో ప్రజాస్వామ్య విలువల క్షీణతగా ఆయన వివరించాడు. నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు, ఇతర ఆర్థిక సంస్కరణలు, చిన్న వ్యాపారాలు, పేదలు, మధ్యతరగతి ప్రజలను దెబ్బతీశాయని, అయితే పెద్ద కంపెనీలకు ప్రయోజనం చేకూర్చాయని ఆయన విమర్శించారు. ఈ సమస్యను కేవలం ఆర్థిక విధానంలో ఒకటిగా కాకుండా భారతదేశ సామాజిక నిర్మాణాన్ని బెదిరించే వ్యవస్థాగత సమస్యగా ఎత్తి చూపారు. రాహుల్ వ్యాఖ్యలు... భారతదేశంలో 'రెండు-అంచెల' ఆర్థిక వ్యవస్థగా పేర్కొన్న దానిపై స్పష్టమైన విమర్శగా ఉన్నాయి.

ఆటోలకు పరిహారం పెంచండి

రవీంద్రనాథ్, శంకర్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణానది, బుడమేరు వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ఆటోలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. ఆ మేరకు పరిహారం చెల్లించకుంటే నెలాఖరులో కార్మిక, రవాణా శాఖల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్వర్యంలో స్థానిక లెనిన్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నా అనంతరం వారు మాట్లాడుతూ... ఆటో కార్మికులు ప్రభుత్వం ఇస్తున్న సాయం అరకొరగా ఉందన్నారు. మొదటి అంతస్తులో కార్మికుడు ఉంటే పరిహారం ఇవ్వటం లేదన్నారు. సర్వస్వం కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే అనేక ఆంక్షలతో ఎన్యూమరేషన్ చేసి ఎదో ఒకటి వర్తింపజేస్తామని చెప్పి పరిహారం ఇవ్వకపోవటం దారుణం అన్నారు. కొత్త ఆటోల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని కోరారు. ఇన్సూరెన్సు కంపెనీలపైకి నెట్టి నష్టపరిహారం ఇవ్వకపోవటం సరికాదన్నారు. బాధితుల వినతులు తీసుకుని ఫొటో పెడుతున్నారు తప్ప సమస్య పరిష్కారం కావటం లేదన్నారు. శంకర్ మాట్లాడుతూ వరద నీటిలో సుమారు నాలుగువేల ఆటోలు మునిగి పాడైపోయాయని చెప్పారు. రూ. 10 వేల నష్టపరిహారం అరకొరగా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో సీఎం చంద్రబాబును బృందం కలిసి వరద సహాయాన్ని రెట్టింపు చేయమని కోరగా ఆయన పరిశీలిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి గూడేల జనార్దన్ ప్రసంగిస్తూ ఆటో కార్మికులు ప్రైవేట్ రుణాలు కట్టుకోలేక అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, నగర కార్యదర్శి కొట్టు రమణారావు, కేవీ భాస్కరరావు, సంగుల పేరయ్య, మన్నెం సుబ్బయ్య ప్రసంగించారు. పి.సుబ్రహ్మణ్యం, కోరే వెంకచ్చి, ఎర్రా రాములు, పచ్చల శ్రీను, ఛారి, ప్రసాద్, కొండ, వెంకన్న, కె. శ్రీను, దోనేపూడి శివ, కె.సాంబయ్య, రాజు పాల్గొన్నారు.

బీహార్ వర్షాలు, వరదలను

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండ్

పాట్నా: బీహార్‌లో కురిసన వర్షాలు, సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు కనీస మద్దతు లభించకపోవడాన్ని ఆక్షేపించారు. ఆహార పొట్లాలు, తాగునీరు, మందులు సరఫరా చేయలేదని బీహార్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతటి నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. తమ గోడు వినే నాధుడే లేదని బాధితులు తమ వద్ద వాపోయారన్నారు. నారాయణ మంగళవారం సీతామర్హి జిల్లాలోగల తిలక్ తాజ్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులను పరామర్శించారు. సీపీఐ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ఆయన వెంట బీహార్ రాష్ట్ర కార్యదర్శి విశ్వజిత్, జిల్లా కార్యదర్శి జయప్రకాశ్ రాయ్ ఉన్నారు. నారాయణ మాట్లాడుతూ బీహార్ ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత ప్రవర్తన ఆమోదయోగ్యం కాదన్నారు. యుద్ధ ప్రాతిపదికన నిత్యావసరాలు, కనీస వసతలను బాధితులకు కల్పించాలని డిమాండ్ చేశారు. పశువులు, ఆవులు, గేదెలకు కనీసం మేత, మందులు, ఆశ్రయం కల్పించలేదన్నారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకొని బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని నారాయణ కోరారు. కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగి పడి వంతెనలు కూలిపోతే... సైన్యం, ఇంజినీర్లు కేవలం 24 గంటల్లో తాత్కాలిక వంతెనను అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. బీహార్‌లో కూలిపోయిన వంతెనల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మూడు రోజులైనా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమీ పట్టడంలేదా అని నిలదీశారు. ఇది బాధ్యతారాహిత్యానికి తార్కాణమని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని బీహార్ ప్రజలను ఆదుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

సిరీస్ టీమిండియా కైవసం

కాన్పూర్: వర్షం అంతరాయం కారణంగా దాదాపు రెండు రోజుల ఆట రద్దయిన కాన్పూర్ టెస్టులో బంగ్లాదేశ్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. రెండవ ఇన్నింగ్స్‌లో 95 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లక్ష్య ఛేదనలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ అర్ధ సెంచరీతో చెలరేగాడు. దీంతో టెస్ట్ సిరీస్ 2-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుమందు చివరిదైన 5వ రోజు మంగళవారం బంగ్లాదేశ్ బ్యాటింగ్ 26/2 వద్ద ప్రారంభమైంది. భారత బౌలర్లు విజృంభించడంతో ఆ జట్టు కేవలం 146 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా తలో మూడు వికెట్లు తీశారు. దీంతో భారత్ విజయలక్ష్యం 95 పరుగులుగా ఖరారైంది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు దూకుడుగా ఆడారు. జైస్వాల్ 51 పరుగులతో రాణించాడు. చివర్లో విరాట్ కోహ్లీ 29, రిషబ్ పంత్ 4 చొప్పున పరుగులు సాధించి భారత్‌ను విజయ తీరాలకు తీసుకెళ్లారు. మిగతా బ్యాటర్లలో రోహిత్ శర్మ (8), శుభ్‌మన్ గిల్ 6, జైస్వాల్ 51 చొప్పున పరుగులు సాధించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిదీ హసన్ మిరాజ్ 2 వికెట్లు, తైజుల్ ఇస్లామ్ ఒక వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు యశస్వి జైస్వాల్‌కు, ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డ్ రవిచంద్రన్ అశ్విన్‌కు దక్కాయి. ఇక ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి ప్రత్యర్థి బంగ్లాదేశ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 233 పరుగులు చేసింది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు సమన్లు

నాసిక్: హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై దాఖలయిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా కోర్టు సమన్లు జారీ చేసింది. నాసిక్, అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ దీపాలి పరిమల్ కదుస్కర్ సెప్టెంబరు 27న గాంధీకి సమన్లు జారీ చేశారు. 'దేశభక్తి కలిగిన వ్యక్తికి వ్యతిరేకంగా చేసిన ప్రకటన ప్రాథమికంగా పరువు నష్టం కలిగించేలా ఉంది' అని నోటీసు పేర్కొంది. కేసు తదుపరి తేదీలో గాంధీ వ్యక్తిగతంగా లేదా అతని చట్టపరమైన ప్రతినిధి ద్వారా హాజరుకావలసి ఉంటుంది. అయితే అది ఇంకా నిర్ణయించలేదు. ఒక ఎన్‌జీవో డైరెక్టర్‌గా ఉన్న ఫిర్యాదుదారు, తాను హింగోలిలో గాంధీ ప్రసంగించిన విలేకరుల సమావేశాన్ని, నవంబరు 2022లో కాంగ్రెస్ నాయకుడు చేసిన ప్రసంగాన్ని చూశానని పేర్కొన్నారు. గాంధీ, రెండు సందర్భాల్లో తన మాటలు, దృశ్యమాన ప్రాతినిధ్యాల ద్వారా తెలిసి వీర్ సావర్కర్ ప్రతిష్ఠను దెబ్బతీశారని, సమాజంలో వీర్ సావర్కర్ ప్రతిష్ఠను కించపరిచే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఫిర్యాదుదారు ప్రకారం, 'సావర్కర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ జీన్' అని గాంధీ వ్యాఖ్యానించారు. 'సావర్కర్ విడుదల కోసం ముకుళిత హస్తంతో ప్రార్థించారని, ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం కోసం పని చేస్తానని వాగ్దానం చేశారని' గాంధీ ఆరోపణలు చేశారు.

తుది దశ ప్రశాంతం

జమ్మూకశ్మీర్‌లో 66 శాతం పోలింగ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో తుది దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చివరి దశలో 40 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 65.48శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా ఉద్ధంపూర్ జిల్లాలో 72.91శాతం, అత్యల్పంగా బారాముల్లాలో 55.73శాతం చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి. యువ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. 39 లక్షల మందికిపైగా అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 415 మంది భవిష్యత్‌ను నిర్ణయించారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 5,060 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు భారత ఎన్నికల సంఘం తెలిపింది. ఓటింగ్ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించింది. పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులైన వాల్మీకీ సమాజ్, గూర్ఖా వర్గీయులు తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోవడంతో తుది దశకు ప్రాధాన్యత ఏర్పడింది. అధికరణ 370 రద్దు తర్వాత ఈ వర్గాలకు ఓటు హక్కు లభించింది. కాగా, కశ్మీర్ డివిజన్ పరిధిలోని కుప్వారా, బారాముల్లా, బందీపురాతో పాటు జమ్మూ డివిజన్ పరిధిలోని జమ్మూ, ఉద్ధంపూర్, కథువా, సాంబా జిల్లాల్లో ఓటింగ్ జరిగింది. మొదటి దశలో 24 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 61.13శాతం పోలింగ్ నమోదు కాగా రెండవ దశలో 25 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 56.95శాతం పోలింగ్ నమోదైంది. తొలి రెండు దశల కంటే మూడో దశలో పోలింగ్ మెరుగైంది. ఎన్నికల ప్రక్రియ సావుగా సాగిందని, పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే ఈనెల 5న ఎగ్జిట్‌పోల్స్, 8న ఫలితాలు వెలువడనున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.